మంగళవారం
TUESDAY
17-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 138

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక





ఆరుతడి.. కంటతడి!

“పంట మార్పిడి పిలుపునకే సర్కారు పరిమితం”

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఇందుకోసం వ్యవసాయ శాఖ అధికారులతో గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పంట మార్పిడిపై రైతులకు సూచనలు చేస్తోంది. అయితే ఆరుతడి పంటల సాగుకు అవసరమైన ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో కార్యాచరణ కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం చెబుతున్న పంట మార్పిడి మాటలు ఆచరణలోకి రాకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంటోంది.

ప్రోత్సాహకాలు, కొనుగోలు భరోసాపై స్పష్టత కరువు

సోలార్ ఫెన్సింగ్, డ్రిప్, స్ప్రింక్లర్లు కోసం రైతుల ఎదురుచూపులు

యాసంగి సాగు వేళ హడావుడిగా వివరాల సేకరణ



(ఈవార్తలు గ్రౌండ్ రిపోర్ట్)

వరి పంటకు ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఇతర ఆరుతడి పంటలు సాగు చేయాలంటే రైతులకు అనేక సదుపాయాలు అవసరం. ముఖ్యంగా కూరగాయల సాగు చేసే రైతులకు అడవి జంతువులు, కోతుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. నీటి వినియోగాన్ని తగ్గించేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు అందించాలి. కలుపు నివారణ, తేమ సంరక్షణ కోసం మల్చింగ్ సదుపాయం కల్పించాలి. తీగజాతి పంటల సాగుకు పెండాల్స్ ఏర్పాటు చేయాలి. నీటి నిల్వ కోసం ఫార్మ్ పాండ్స్ నిర్మాణానికి ప్రోత్సాహకాలు అందించాలి. అదేవిధంగా తరువాయి 2 వ పేజీలో...



టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): తెలంగాణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును విద్యాశాఖ పొడిగించింది. సవరించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 26 వరకు ఎలాంటి లేట్ ఫీజు లేకుండా చెల్లించవచ్చు. రూ.50 లేట్ ఫీజుతో డిసెంబర్ 8 వరకు, రూ.200తో డిసెంబర్ 10 నుంచి 21 వరకు, రూ.500తో డిసెంబర్ 23 నుంచి జనవరి 4 వరకు అవకాశం తరువాయి 2 వ పేజీలో...



30న హైదరాబాద్‌లో ఆటోల బంద్

హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): తమ డిమాండ్ల పరిష్కారం కోసం నవంబర్ 30న హైదరాబాద్‌లో ఆటోల బంద్ నిర్వహించనున్నట్లు మహాత్మా గాంధీ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ ప్రకటించింది. సోమవారం హైదర్‌గూడలో జేఏసీ కన్వీనర్ మహమ్మద్ అమానుల్లా ఖాన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన కొత్త మీటర్ చార్జీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్ క్యాబ్‌లు, బైక్ ట్యాక్సీలను నిషేధించాలని కోరారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం హామీ ఇచ్చిన ఏడాదికి రూ.12 వేల చొప్పున తరువాయి 2 వ పేజీలో...

ప్రజల ప్రేమ నన్ను కదిలించింది

ఆత్మకథ ఆవిష్కరణలో సోనియా భావోద్వేగం



న్యూఢిల్లీ, నవంబర్ 16 : తన ఆత్మకథకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ తనను భావోద్వేగానికి గురిచేసిందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తెలిపారు. ‘బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్’ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తన పుస్తకంపై ఇంత పెద్దఎత్తున ప్రజలు ఆసక్తి చూపుతారని ఊహించలేదని పేర్కొన్నారు. ప్రజలు చూపిస్తున్న ప్రేమ, అభిమానంతో తాను ఉక్కిరిబిక్కిరి అవుతున్నానని సోనియా గాంధీ చెప్పారు. తన పుస్తకంపై కొంత ఆసక్తి ఉంటుందని భావించానని, అయితే ఇంతటి స్పందన వస్తుందని అనుకోలేదన్నారు. పుస్తకాన్ని కొనుగోలు చేయడంతో పాటు తమ అభిప్రాయాలను తరువాయి 2 వ పేజీలో...

రేవంత్‌కు సోయిలేదు

సీఎం అలసత్వం వల్లే తాగునీటి కష్టాలు

సోనియా పుస్తకంలో అబద్ధాలు రాశారు.. రేవంత్, రాహుల్‌పై ఈటల రాజేందర్ ధ్వజం

సీఎం రేవంత్‌రెడ్డికి ముందుచూపు లేకపోవడం వల్లే హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి కష్టాలు వచ్చాయని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి మూటలు పంపడంపై ఉన్న ఆసక్తి తెలంగాణ ప్రజల సమస్యలను పరిష్కరించడంపై లేదని ఆరోపించారు.



యాదగిరిగుట్ట, నవంబర్ 16 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు వస్తాయని ఏడాది ముందే హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. సోనియా గాంధీ తన పుస్తకంలో అబద్ధాలు రాస్తుంటే, రాహుల్ గాంధీ దేశంలో అల్లర్లు జరగాలని కోరుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాని మోదీని విమర్శిస్తూ దేశ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని తరువాయి 2 వ పేజీలో...



బిర్యానీ ప్లేట్‌పై రూ.50 పెంపు!

హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): హైదరాబాద్‌లో బిర్యానీ ధరలు భారీగా పెరిగాయి. నగరంలోని పలు ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లు ప్లేట్‌పై రూ.50 వరకు పెంచడంతో బిర్యానీ ప్రియులపై అదనపు భారం పడుతోంది. ముడిసరుకులు, కమర్షియల్ గ్యాస్ ధరలు పెరగడమే ఇందుకు కారణమని హోటళ్ల నిర్వాహకులు చెబుతున్నారు. నగరంలో రోజుకు సుమారు 6 లక్షల బిర్యానీ ప్లేట్లు అమ్ముడవుతాయని అంచనా. ఒక్కో ప్లేట్‌పై సగటున రూ.30 పెరిగినా వినియోగదారులపై నెలకు రూ.54 కోట్ల అదనపు తరువాయి 2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.13,680
వెండి (కిలో):	రూ.1,90,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,462



కవిత ‘భైరవ’ యాత్ర

పాంచజన్య సంకల్పం కోసం ప్రజల్లోకి వెళ్తా.. ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయం సరైంది కాదు

హరీశ్‌రావు అవినీతిపై నిగ్గు తేలేదాకా ఫైట్ చేస్తం.. తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ‘వారాహి’ పేరుతో యాత్ర చేపట్టిన తరహాలోనే తాను ‘భైరవ’ యాత్రతో ప్రజల్లోకి వెళ్లబోతున్నట్లు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పాంచజన్య సంకల్పంలో భాగంగా భైరవ వాహనంపై త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తామని వెల్లడించారు.

నిజామాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అవినీతిపై నిగ్గు తేల్చాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆయనపై ఉన్న తరువాయి 2 వ పేజీలో...

7 లక్షల మందికి ఇళ్లీ పట్టాలు

ఏళ్లుగా తనఖాలో ఉన్న ఇంటి పట్టాల వాపసుకు సర్కారు నిర్ణయం

కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం

పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు అందజేస్తాం: పొంగులేటి



హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లు సహా పలు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్లు పొందిన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. పదేళ్లకు పైగా తనఖాలో ఉన్న ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను తిరిగి అందించాలని నిర్ణయించింది. 2014కు ముందు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ గృహకల్ప, వాంబే పథకాల కింద ఇళ్లు పొందిన వారికి ఈ నిర్ణయం వర్తించనుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్న లబ్ధిదారుల ఒరిజినల్ పట్టాలు, పొజిషన్ తరువాయి 2 వ పేజీలో...



ఐఐటీ హైదరాబాద్ నీటి పొదుపు

నెలకు రూ.58 లక్షల ఆదా

హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): నీటి సంరక్షణ చర్యలతో ఐఐటీ హైదరాబాద్ ఆదర్శంగా నిలిచింది. సంగారెడ్డి జిల్లా కంది సమీపంలోని ఐఐటీ క్యాంపస్‌లో గత పది నెలల్లో జలమండలి నుంచి తీసుకునే నీటిని రోజుకు 2 వేల కిలోలీటర్ల నుంచి 700 కిలోలీటర్లకు తగ్గించింది. దీంతో నెలకు రూ.కోటికి పైగా వచ్చే వాటర్ బిల్లు తరువాయి 2 వ పేజీలో...

విశ్వవాణి



రక్తంలో హానికరమైన కొవ్వు పదార్థాలను తగ్గించేందుకు శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన జన్యు ఎడిటింగ్ చికిత్స ఆశాజనక ఫలితాలను ఇచ్చింది. సీటీఎక్స్310' పేరుతో క్రిస్పర్ థెరప్యూటిక్స్ సంస్థ రూపొందిస్తున్న ఈ చికిత్సను తొలిదశ మానవ ప్రయోగాల్లో పరీక్షించారు. ఇందుకు సంబంధించిన పరిశోధన ఫలితాలు ప్రతిష్ఠాత్మక 'ది న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్'లో ప్రచురితమయ్యాయి. సాధారణంగా కొలెస్ట్రాల్ నియంత్రణకు మందులను క్రమం తప్పకుండా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ కొత్త విధానంలో కాలేయ కణాల్లోని నిర్దిష్ట జన్యువును మార్చడం ద్వారా దీర్ఘకాలం ప్రభావం కొనసాగేలా చికిత్సను రూపొందిస్తున్నారు.



తెలంగాణకు తాగునీటి గండం!

శ్రీశైలంలో అడుగంటుతున్న నీటి నిల్వలు

829 అడుగులకు పడిపోయిన జలాశయం నీటిమట్టం

జూలై వరకు 46 టీఎంసీలు కేటాయించాలని తెలంగాణ డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): తెలంగాణకు తాగునీటి గండం పొంచి ఉంది. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు వేగంగా తగ్గిపోతుండటం, ఆంధ్రప్రదేశ్‌తో నీటి పంపకాలపై స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల సమావేశాలు వరుసగా వాయిదా పడుతుండటంతో తాగునీటి కేటాయింపులపై నిర్ణయాలు నిలిచిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న వేసవిలో హైదరాబాద్‌తో పాటు దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తీవ్ర తరువాయి 2 వ పేజీలో...

ఏపీపై ‘అక్వాన్’ పంజా!

అమరావతికి మళ్లీ ముంపు ముప్పు.. 20న మచిలీపట్నం వద్ద ల్యాండ్‌ఫాల్

ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ తుఫాన్ ముప్పు పొంచి ఉందంటూ వెలువడుతున్న వాతావరణ అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అక్వాన్' తుఫాన్‌గా బలపడి ఏపీ తీరం వైపు దూసుకొస్తోందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.



అమరావతి, నవంబర్ 17 (ఈవార్తలు): నవంబర్ 20న బాపట్ల-మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 140 నుంచి 150 కిలోమీటర్లకు పైగా వేగంతో గాలులు వీస్తాయని కొన్ని ప్రైవేట్ వాతావరణ అంచనాలు పేర్కొంటున్నాయి. అయితే తుఫాన్ పేరు, తీవ్రత, తీరం దాటే ప్రాంతం, గాలుల వేగంపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారిక నిర్ధారణను పరిశీలించాల్సి ఉంది. భారత వాతావరణ శాఖ నవంబర్ 16 రాత్రి 8.30 గంటలకు విడుదల చేసిన బులెటిన్ ప్రకారం, 'అక్వాన్' తరువాయి 2 వ పేజీలో...



ఒకే పరికరంతో మంచినీరు.. ఏసీ

రాశి ఫలాలు
17.11.2026

మేషం: నిరుద్యోగుల ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. వ్యాపార వ్యవహారాలలో లోటుపాట్లు సరిచేసుకుంటారు. గృహమున సంతాన శుభకార్య ప్రస్తావన వస్తుంది. ఆర్థిక పురోగతి కలుగుతుంది. అప్రయత్నంగా కొన్ని పనులు పూర్తి అవుతాయి. దూర ప్రాంత దైవ దర్శనాలు చేసుకుంటారు.

వృషభం: దైవ చింతన పెరుగుతుంది. ఋణ ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ముఖ్యమైన పనులు మందగిస్తాయి. కుటుంబమున కొందరి మాటలు వివాదస్పదంగా మారతాయి. ధన పరంగా ఇబ్బందులు తప్పవు. ఉద్యోగాలలో ఊహించని మార్పులు ఉంటాయి.

మిథునం: ఆప్తులతో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన వ్యవహారాలు మరింతగా మందగిస్తాయి. మానసికంగా సమస్యలు కొంత బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఆదాయ మార్గాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో ఇతరుల నుండి విమర్శలు పెరుగుతాయి.

కర్కాటకం: ఉద్యోగమున ఒక సమాచారం ఆసక్తి కలిగిస్తుంది. వ్యాపారమున నూతన ఆలోచనలతో ముందుకు సాగుతారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగుల శ్రమ ఫలిస్తుంది. సంఘంలో పెద్దల నుండి ఆహ్వానాలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

సింహం: సంఘంలో పెద్దల పరిచయాలు అంతగా కలసిరావు. కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత చికాకు పరుస్తుంది. వృత్తి వ్యాపారాలలో ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగమున శ్రమకు తగిన గుర్తింపు లభించదు. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఆదాయానికి ఇబ్బంది తప్పదు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: దైవ కార్యక్రమాలకు ధనం అందిస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. మొండి బాకీలు వసూలవుతాయి. వ్యాపారాలలో మెరుగైన లాభాలు పొందుతారు. ఉద్యోగులకు అనుకూల పరిస్థితులుంటాయి. చుట్టుపక్కల వారితో వివాదాలలో పై చేయి సాధిస్తారు. రాజకీయ సభ సమావేశాలకు హాజరవుతారు.

తుల: కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో వైద్యుని సంప్రదించడం మంచిది. చేపట్టిన పనులు అతికష్టం మీద పూర్తి అవుతాయి. వృత్తి, ఉద్యోగాలలో ప్రతికూల పరిస్థితులు వేదిస్తాయి. స్థిరాస్తి సంభందిత విషయాలలో వివాదాలు తప్పవు. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు అంతగా కలసిరావు.

వృశ్చికం: బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపార వ్యవహారాలలో మీ అంచనాలు నిజం అవుతాయి. ఆర్థిక ఇబ్బందుల నుండి కొంత వరకు బయటపడతారు.

ధనస్సు: వృత్తివ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులు నూతన అవకాశాలు అందిపుచ్చుకుంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేసి లాభాలు పొందుతారు. ఉద్యోగులకు అధికారుల ఆదరణ పెరుగుతుంది. మిత్రులతో శుభకార్యాలకు హాజరవుతారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు.

మకరం: ఇతరులతో తొందరపడి మాట్లాడడం మంచిది కాదు. దూర ప్రయాణ సూచనలున్నవి. ఉద్యోగాలలో సహోద్యోగుల ప్రవర్తన కొంత చికాకు కలిగిస్తుంది. వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణించవు. బంధువర్గం వారితో మాటపట్టింపులంటాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి.

కుంభం: వాహన ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. కొన్ని పనులు అనుకున్న సమయానికి పూర్తికావు. ఖర్చులకు తగిన ఆదాయం లభించదు. ఉద్యోగమున స్థానచలన సూచనలున్నవి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నూతన ఋణయత్నాలు వ్యర్థంగా మిగులుతాయి.

మీనం: అన్ని రంగాల వారికి లాభదాయకంగా ఉంటుంది. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. సంఘంలో పలుకుబడి పెరుగుతుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో సమస్యలు తొలగుతాయి. దీర్ఘకాలిక వివాదాల నుండి ఉపశమనం పొందుతారు.

ఆరుతడి.. కంట తడి!



మొదటి పేజీ తరువాయి

ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు పంట విక్రయాల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు మార్కెటింగ్ వ్యవస్థపై స్పష్టమైన హామీ ఇవ్వాలి. ఇవేవీ లేకుండా కేవలం వరి సాగు వద్దని, ఆరుతడి పంటలు సాగు చేయాలని చెప్పడం వల్ల రైతులు ఎలా ముందుకు వస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మంత్రివర్గ ఉపసంఘం.. క్షేత్రస్థాయిలో చర్యలేవి?

ఆరుతడి పంటల సాగు ప్రోత్సాహం, పంట మార్పిడి తదితర అంశాలపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, ఆ కమిటీ ద్వారా తీసుకున్న నిర్ణయాలు రైతులకు ఎప్పుడు అందుతాయనే విషయంలో స్పష్టత లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉపసంఘం ఏర్పాటు, అధికారుల సమావేశాలు, ప్రకటనలకే వ్యవహారం పరిమితమైందని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థాయిలో వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ, రైతులకు అవసరమైన పరికరాలు, ఆర్థిక సహాయం, కొనుగోలు భరోసా మాత్రం అందుబాటులోకి రావడం లేదని చెబుతున్నారు.

యాసంగి వేళ హడావుడిగా వివరాల సేకరణ

ఇప్పటికే కొన్ని జిల్లాల్లో వానాకాలం పంట కోతలు పూర్తవుతుండగా, యాసంగి వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. కొందరు రైతులు ఇప్పటికే వరి నారుమడులు కూడా పోశారు. ఇలాంటి కీలక సమయంలో ప్రభుత్వం ఆరుతడి పంటల సాగుకు అవసరమైన సౌకర్యాలపై రైతుల నుంచి వివరాలు సేకరించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. సోలార్ ఫెన్సింగ్, మల్చింగ్, కూరగాయల సాగుకు అవసరమైన డ్రిప్, స్ప్రింక్లర్లు, తీగజాతి పంటలకు పెండాల్స్, ఫార్మ్ పాండ్స్ తదితర సదుపాయాలు అవసరమైన రైతుల వివరాలను రెండు రోజుల్లో సేకరించాలని ఆదేశించడంతో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రస్తుతం రైతులను సంప్రదిస్తున్నారు. వరి సాగు చేస్తున్న రైతులు ప్రత్యామ్నాయంగా ఏయే ఆరుతడి పంటలు సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నారు? వాటికి ఎలాంటి ప్రోత్సాహకాలు, సౌకర్యాలు కావాలి? అనే వివరాలను సేకరిస్తున్నారు. అయితే ఈ ప్రక్రియ కనీసం నెల రోజుల ముందే ప్రారంభించి ఉంటే రైతులు తమ పంటల ప్రణాళికను మార్చుకునేందుకు అవకాశం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు అంచనాలు, వర్షాభావ పరిస్థితులపై చర్చలు జరుగుతున్న సమయంలోనే ప్రభుత్వం రైతులకు అవసరమైన సౌకర్యాల కల్పనపై కార్యాచరణ సిద్ధం చేయాల్సి ఉండేది. ఇప్పుడు యాసంగి సాగు సమీపించిన తర్వాత వివరాల సేకరణ చేపట్టడం వల్ల ఎంతమంది రైతులు పంట మార్పిడికి ముందుకు వస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

కొనుగోలు భరోసా లేకుంటే రైతులు ముందుకొచ్చేదెలా?

వరి సాగు నుంచి ఆరుతడి పంటల వైపు రైతులు మళ్లాలంటే ప్రభుత్వం ముందుగా వారికి భరోసా కల్పించాలి. వరి పంటకు ఉన్న కొనుగోలు వ్యవస్థతో పోలిస్తే ప్రత్యామ్నాయ పంటలకు మార్కెటింగ్ సదుపాయాలు, కొనుగోలు కేంద్రాలపై రైతుల్లో అనేక సందేహాలు ఉన్నాయి. పంట పండించిన తర్వాత కొనుగోలు చేసేవారు లేకపోతే పెట్టుబడి ఎలా తిరిగి వస్తుందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. అలాగే సోలార్ ఫెన్సింగ్, డ్రిప్, స్ప్రింక్లర్లు, మల్చింగ్ వంటి సదుపాయాలకు ఎంతమేర సబ్సిడీ ఇస్తారు? ఎప్పుడు అందిస్తారు? పెండాల్స్, ఫార్మ్ పాండ్స్ నిర్మాణానికి నిధులు ఎప్పుడు విడుదల చేస్తారు? ఆరుతడి పంటలకు కొనుగోలు కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేస్తారు? మద్దతు ధరపై ఎలాంటి హామీ ఉంటుంది? అనే ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సి ఉంది.

మళ్లీ వరి సాగువైపే రైతుల మొగ్గు?

ప్రభుత్వం ఒకవైపు ఆరుతడి పంటలు సాగు చేయాలని పిలుపునిస్తుండగా, మరోవైపు వాటికి అవసరమైన ప్రోత్సాహకాలు, రక్షణ సదుపాయాలు, మార్కెటింగ్ వ్యవస్థపై స్పష్టత లేకపోవడం రైతులను ఆలోచనలో పడేస్తోంది. ఇప్పటికే వరి సాగుకు అలవాటుపడిన రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగులో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మళ్లీ సంప్రదాయ వరి సాగుకే మొగ్గుచూపే ప్రమాదం ఉంది. ప్రభుత్వ లక్ష్యం నిజంగా పంట మార్పిడే అయితే కేవలం అవగాహన కార్యక్రమాలతో సరిపెట్టకుండా రైతులకు అవసరమైన సౌకర్యాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి. ఆరుతడి పంటలకు అవసరమైన పెట్టుబడి సాయం, సాగు పరికరాలు, పంట రక్షణ, నీటి వసతి, కొనుగోలు కేంద్రాలు, గిట్టుబాటు ధరపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులను ముందస్తుగా సిద్ధం చేయాల్సిన సమయంలో ఇప్పుడు హడావుడిగా వివరాలు సేకరించడం వల్ల ఆశించిన ఫలితం వస్తుందా? రైతులకు ప్రోత్సాహకాలు, కొనుగోలు భరోసా కల్పించకుండా పంట మార్పిడి సాధ్యమవుతుందా? అన్నది ప్రశ్న. ప్రకటనల నుంచి కార్యాచరణలోకి ప్రభుత్వం ఎప్పుడు వస్తుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు.

రేవంత్‌కు సోయిలేదు

మొదటి పేజీ తరువాయి

హెచ్చరించారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈటల మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతో పాటు కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు, అంతర్జాతీయ సంస్థలు ఏడాది ముందే హెచ్చరించాయని ఈటల గుర్తుచేశారు. ఈ విషయంపై తానే స్వయంగా మీడియా సమావేశం నిర్వహించి ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశానన్నారు. తాగు, సాగునీటి కొరత, భూగర్భ జలాలు అడుగంటిపోవడం, విద్యుత్ సమస్యలపై ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించినా సీఎం పట్టించుకోలేదని విమర్శించారు. 'రేవంత్‌రెడ్డీ.. మీ మాటలు కోటలు దాటుతున్నాయి కానీ కాళ్లు తంగేళ్లు దాటడం లేదు. భూమి మీద ఉండి ఆలోచించండి' అని అప్పుడే చెప్పానన్నారు. కేసీఆర్‌పై కోపం ఉంటే ఉండొచ్చని, ఆ కోపంతో తెలంగాణ రైతులను శిక్షించవద్దని కోరినా వినిపించుకోలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సమస్యలు తలెత్తాయని ఆరోపించారు. బోర్లు, బావులు ఎండిపోవడంతో ప్రజలతో పాటు హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కరువుతో పంటలు ఎండిపోతుంటే, చేతికొచ్చిన కొద్దిపాటి ధాన్యాన్ని అమ్ముకునేందుకు వెళ్లిన రైతులకు కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కూడా కల్పించలేదని ఈటల మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా గన్నీ సంచులు, హమాలీలు, కాంటాలు, టార్పాలిన్లు అందుబాటులో లేవన్నారు. రైతుల సమస్యలపై కనీసం అఖిలపక్ష సమావేశం నిర్వహించి చర్చించాలన్న ఆలోచన కూడా సీఎంకు లేదని విమర్శించారు. 'అన్నీ నాకే తెలుసు.. నేనే చేస్తా' అన్న అహంకార ధోరణితో వ్యవహరిస్తూ రైతులను రోడ్డున పడేశారని ఆరోపించారు.

దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్న రాహుల్ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రైవేట్ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా హైదరాబాద్‌లో 'ప్రోగ్రెసివ్ అలయన్స్' పేరుతో కాంక్లేవ్ నిర్వహించడాన్ని ఈటల తప్పుబట్టారు.

ఏపీపై 'అక్వాన్' పంజా!

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే తుఫాన్‌గా మారింది. దక్షిణ, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ తుఫాన్ మచిలీపట్నానికి ఆగ్నేయంగా 660 కిలోమీటర్ల దూరంలో ఉంది. గంటకు 7 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదులుతోంది. నవంబర్ 17 సాయంత్రానికి తీవ్ర తుఫాన్‌గా, 19వ తేదీ ఉదయానికి అతి తీవ్ర తుఫాన్‌గా బలపడే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. నవంబర్ 20 మధ్యాహ్నం నెల్లూరు-తుని మధ్య ఆంధ్రప్రదేశ్, యానాం తీరాన్ని దాటే అవకాశం ఉందని వెల్లడించింది. ఆ సమయంలో గంటకు 120-130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగాన్ని తాకవచ్చని హెచ్చరించింది.

అమరావతికి మళ్లీ ముంపు ముప్పు?

తుఫాన్ ప్రభావంతో రాజధాని అమరావతి ప్రాంతంలో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల అర్నాబ్, మురుసు తుఫాన్లతో ఎదురైన ఇబ్బందులు ఇంకా మరువకముందే మరో తుఫాన్ ముప్పు రావడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడం, డ్రైనేజీ వ్యవస్థపై ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అయితే అమరావతిపైనే తుఫాన్ అత్యధిక ప్రభావం ఉంటుందని ఇప్పుడే నిర్ధారించలేము. తుఫాన్ గమనం, తీరం దాటే ప్రాంతాన్ని బట్టి ప్రభావం మారే అవకాశం ఉంది. తుఫాన్ ప్రభావంతో నవంబర్ 18 నుంచి కోస్తాంధ్రలో వర్షాలు పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా 19, 20 తేదీల్లో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

ప్రజల ప్రేమ నన్ను కదిలించింది

మొదటి పేజీ తరువాయి

పంచుకుంటున్న పాఠకులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రేమ, ఆప్యాయత తన మనసును కదిలించాయని పేర్కొన్నారు. పుస్తకంపై వస్తున్న విమర్శలను కూడా సానుకూలంగా స్వీకరిస్తున్నట్లు సోనియా గాంధీ చెప్పారు. విమర్శకుల అభిప్రాయాలు కూడా అవసరమేనని, అవి మరింత మెరుగుపడేందుకు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు, సాహితీవేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఐఐటీ హైదరాబాద్ నీటి పాదుపు

మొదటి పేజీ తరువాయి

రూ.42 లక్షలకు తగ్గి, దాదాపు రూ.58 లక్షలు ఆదా అవుతోంది. క్యాంపస్‌లో మూడు ఎస్టీపీ ప్లాంట్ల ద్వారా మురుగునీటిని శుద్ధి చేసి టాయిలెట్ ఫ్లషింగ్, గార్డెనింగ్‌కు వినియోగిస్తున్నారు. వర్షపు నీటి సంరక్షణ కోసం చెరువులు, కుంటలు, 14.84 కిలోమీటర్ల మేర బయో స్వేల్స్ ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 4.79 కోట్ల లీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థ్యాన్ని సమకూర్చుకున్నారు. భూగర్భ జలాలు పెరగడంతో 33 బోర్లను వినియోగిస్తున్నారు. ఐఐటీ హైదరాబాద్ తరహాలోనే బీహెచ్ఈఎల్, బీడీఎల్ వంటి సంస్థలు నీటి పొదుపు చర్యలు చేపట్టాలని జలమండలి అధికారులు సూచించారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

కల్పించింది. రెగ్యులర్ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.125 కాగా, మూడు సబ్జెక్టుల వరకు రాసేవారికి రూ.110గా నిర్ణయించింది. ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ.60 చెల్లించాలి. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది. పాఠశాలల లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లోనే ఫీజు చెల్లించాలని, చలానాలను అంగీకరించబోమని విద్యాశాఖ స్పష్టం చేసింది.

బిర్యానీ ప్లేట్‌పై రూ.50 పెంపు!

మొదటి పేజీ తరువాయి

భారం పడే అవకాశం ఉంది. నెయ్యి కిలో ధర రూ.800 దాటగా, కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3,080కి చేరినట్లు వ్యాపారులు చెబుతున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరగడంతో ధరలు పెంచక తప్పడం లేదని తెలంగాణ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కంచర్ల అశోక్ రెడ్డి తెలిపారు. ధరలు పెంచితే కస్టమర్లు తగ్గుతారని, పెంచకుంటే హోటళ్లు నడపలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

30న హైదరాబాద్‌లో ఆటోల బంద్

మొదటి పేజీ తరువాయి

మూడేళ్ల బకాయిలు రూ.36 వేలు చెల్లించాలన్నారు. ఇటీవల దాడిలో మరణించిన ఆటో డ్రైవర్ మహమ్మద్ ముకరం కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించకుంటే బంద్ తప్పదని, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలని హెచ్చరించారు.

తెలంగాణకు తాగునీటి గండం!

మొదటి పేజీ తరువాయి

తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉండటంతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఏర్పడింది. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 829.10 అడుగులకు పడిపోయింది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, కనీస నిర్వహణ స్థాయి 834 అడుగుల కంటే దిగువకు చేరింది. మొత్తం 215.80 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి ప్రస్తుతం 48.57 టీఎంసీలు మాత్రమే ఉన్నట్లు అందిన సమాచారం చెబుతోంది. జూరాల, సుంకేసుల, హంద్రీ నుంచి జలాశయానికి వచ్చే ఇన్‌ఫ్లోలు పూర్తిగా నిలిచిపోయాయి. నవంబర్ మొదటి తొమ్మిది రోజుల్లోనే 3.03 టీఎంసీల నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వార్షిక ప్రవాహాలు 218 టీఎంసీలకే పరిమితమైనట్లు అంచనాలు పేర్కొంటున్నాయి. రానున్న రోజుల్లో నీటి ఆవిరి నష్టం, వేసవిలో పెరిగే వినియోగంతో జలాశయంపై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నీటి పంపకాల వివాదాలు పరిష్కారం కాకపోవడానికి నదీ యాజమాన్య బోర్డుల సమావేశాలు జరగకపోవడం కూడా కారణమవుతోంది.

7 లక్షల మందికి ఇళ్ల పట్టాలు

మొదటి పేజీ తరువాయి

సర్టిఫికెట్లను తిరిగి అందజేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్ల నిర్మాణానికి రుణాలు మంజూరు చేసిన సమయంలో లబ్ధిదారుల ఒరిజినల్ పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను గృహ నిర్మాణ సంస్థ అధికారులు తనఖా కింద తీసుకున్నారు. అయితే రుణాల ప్రక్రియ పూర్తయినా చాలా ప్రాంతాల్లో ఆ పత్రాలను తిరిగి ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులు ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ముఖ్యంగా ఆస్తుల క్రయవిక్రయాలు, బ్యాంకు రుణాలు, వారసత్వ బదలాయింపుల సమయంలో ఒరిజినల్ పత్రాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల 22ఏ భూములపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఇంటి పట్టాల సమస్య సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వచ్చినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సీఎం ఆదేశించడంతో పట్టాల వాపసుకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారి పత్రాలను తిరిగి అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు సూచించినట్లు చెప్పారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది.

ఒకే పరికరంతో మంచినీరు.. ఏసీ

బిట్స్ హైదరాబాద్ పరిశోధకుల ఆవిష్కరణకు పేటెంట్

హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): ఉప్పు నీటిని తాగునీరుగా మార్చడంతోపాటు గదిని చల్లబరిచే వినూత్న పరికరాన్ని బిట్స్ పిలానీ హైదరాబాద్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. సౌరశక్తితో పనిచేసే ఈ పోర్టబుల్ పరికరానికి భారత పేటెంట్ లభించింది. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్లు సందీప్ ఎస్.దేశ్‌ముఖ్, శంతను ప్రసాద్ దత్తా, రీసెర్చ్ స్కాలర్ కె.సాయి సందీప్ దీనిని రూపొందించారు. గాలిలో తేమను పెంచి, ఆ తర్వాత చల్లబరచడం ద్వారా ఉప్పు నీటి నుంచి స్వచ్ఛమైన నీటిని వేరు చేస్తుంది. అదే సమయంలో గదికి చల్లటి గాలిని అందిస్తుంది. ల్యాబ్ పరీక్షల్లో గంటకు 12.4 లీటర్ల నీటి ఉత్పత్తితోపాటు 6.57 కిలోవాట్ల కూలింగ్ సామర్థ్యం నమోదైంది. లీటరు నీటి కనీస ఉత్పత్తి ఖర్చు కేవలం 30 పైసలుగా తేలింది. రోజుకు 200 లీటర్ల తాగునీటిని అందించేలా పరికరాన్ని అభివృద్ధి చేయాలని పరిశోధకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతమైతే తీర ప్రాంతాలు, ద్వీపాల్లోని ప్రజలకు ఈ పరికరం ఉపయోగపడనుంది.

కవిత 'భైరవ' యాత్ర

మొదటి పేజీ తరువాయి

అవినీతి ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సీబీసీఐడీతో పాటు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు అందజేస్తామని చెప్పారు. ప్రజాక్షేత్రంలో పోరాడటంతో పాటు చట్టపరంగా, న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామన్నారు. తప్పు చేసినవారు ఎంతటి వారైనా శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారు.

కరువుపై కేంద్రాన్ని సాయం కోరరా?

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. ప్రధాని మోదీని కలిసిన సీఎం రాష్ట్రంలో కరువు పరిస్థితులు, రైతుల సమస్యలు, పంటల పరిస్థితిపై కనీసం చర్చించకపోవడం అన్యాయమన్నారు. రైతులను ఆదుకునేందుకు కేంద్రం నుంచి సాయం కోరాలన్న ఆలోచన కూడా సీఎంకు లేకపోవడం దారుణమని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లు అంశాన్ని కూడా ప్రధాని దృష్టికి తీసుకెళ్లకపోవడాన్ని తప్పుబట్టారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి కాంట్రాక్టులు, కమీషన్ల గురించే మాట్లాడుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కరువు మండలాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత కానీ రైతులను పంటలు వేయవద్దని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డేనని విమర్శించారు. పంటలు సాగు చేయవద్దని సూచిస్తున్న ప్రభుత్వం రైతులకు ఎలాంటి పరిహారం ఇస్తుందో స్పష్టం చేయాలన్నారు. రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కవిత ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఇంతకాలమైనా కనీసం జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదని విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా కాలం వెళ్లదీస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ పార్టీ లక్ష్యమన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

కౌశిక్‌రెడ్డి పిటిషన్ కొట్టివేత





హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన గొంతు నమూనాలు (వాయిస్ శాంపిల్స్) సేకరించేందుకు పోలీసులు జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో పోలీసుల దర్యాప్తులో భాగంగా ఆయన వాయిస్ శాంపిల్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఏడాది జనవరి 29న జరిగిన మినీ మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా అప్పటి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై కౌశిక్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై కరీంనగర్ జిల్లా వీణవంక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా ఘటన నాటి ఆడియో, వీడియో రికార్డులతో సరిపోల్చేందుకు పోలీసులు ఆయన గొంతు నమూనాలను సేకరిం చాలని నిర్ణయించారు. వాయిస్ శాంపిల్స్ సేకరణకు మేజిస్ట్రేట్ కోర్టు అనుమతి ఇవ్వడంతో దర్యాప్తు అధికారులు కౌశిక్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు, నోటీసులను రద్దు చేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల చర్య చట్టవిరుద్ధమని, తన హక్కులకు భంగం కలిగిస్తోందని ఆయన తరఫు న్యాయవాదులు వాదించారు. నేర విచారణలో ఆధారాలను శాస్త్రీయంగా నిర్ధారించేందుకు వాయిస్ శాంపిల్స్ సేకరించడం సాధారణ ప్రక్రియేనని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు దర్యాప్తు ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.

డీప్‌ఫేక్‌తో మానసిక దాడి

ఏఐ దుర్వినియోగం అవుతోంది

అడ్డుకట్టకు కేంద్ర చర్యలు తీసుకోవాలి

కిషన్ రెడ్డికి చిరంజీవి వినతి

హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డీప్‌ఫేక్‌ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రముఖ సినీ నటుడు చిరంజీవి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర హోం, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖలను ఉద్దేశించి రూపొందించిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి అందజేశారు. ఇటీవల హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చిరంజీవి తన కుమారుడు రామ్‌చరణ్‌తో కలిసి భేటీ అయ్యారు. ఏఐ ద్వారా రూపొందిస్తున్న కంటెంట్‌తో కళాకారుల హక్కులు, గౌరవానికి ముప్పు ఏర్పడుతోందని ఆ సమావేశంలో వివరించారు. దీనిపై స్పందించిన అమిత్ షా, అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని, అవసరమైన నిబంధనలు తీసుకొస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అధికారికంగా వినతిపత్రం సమర్పించాలని చిరంజీవికి సూచించారు. అమిత్ షా సూచన మేరకు చిరంజీవి ఈ వినతిపత్రాన్ని కిషన్‌రెడ్డికి అందజేశారు. అనంతరం ఎక్స్ వేదికగా స్పందిస్తూ, సంబంధిత మంత్రిత్వ శాఖలతో సమన్వయం చేసి ఈ అంశాన్ని ముందుకు తీసుకెళ్తానని కిషన్‌రెడ్డి భరోసా ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కళాకారుల గౌరవం, గుర్తింపు, సృజనాత్మక హక్కులతో పాటు ప్రతి పౌరుడి భద్రతను కాపాడటం అందరి బాధ్యతని పేర్కొన్నారు. సాంకేతికత సృజనాత్మకతను పెంచాలి కానీ, గౌరవాన్ని దెబ్బతీయకూడదని చిరంజీవి పేర్కొన్నారు.



చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో రైలు బోగీలో మంటలు

హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో సోమవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. 5, 6వ నంబర్ ప్లాట్‌ఫారాల మధ్య ట్రాక్‌పై నిలిపి ఉంచిన ఖాళీ రైలు బోగీలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో బోగీలో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సాయంత్రం 6.30 గంటల సమయంలో బోగీ నుంచి దట్టమైన పొగలు, మంటలు రావడాన్ని స్టేషన్ సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమై 6.35 గంటలకు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించి రాత్రి 7.15 గంటలకల్లా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటలు పక్కనున్న బోగీలకు, ప్లాట్‌ఫారానికి వ్యాపించలేదు. ప్రమాదానికి గురైన బోగీ పూర్తిగా ఖాళీగా ఉందని, ఎవరికీ గాయాలు కాలేదని దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు. మంటలు చెలరేగడానికి గల కారణాలపై విచారణ చేపట్టినట్లు తెలిపారు.

డేటింగ్ యాప్‌తో వల

మత్తుమందు ఇచ్చి దోపిడీ

హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): గే డేటింగ్ యాప్ ద్వారా పరిచయాలు పెంచుకుని, బాధితులను దోచుకుంటున్న ఐదుగురు సభ్యుల ముఠాను కుషాయిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితులకు మత్తుమందు ఇచ్చి నగదు, బంగారు ఆభరణాలు దోచుకోవడంతో పాటు, వ్యక్తిగత వీడియోలతో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు గే డేటింగ్ యాప్‌లో ఖాతాలు తెరిచి పలువురితో పరిచయాలు పెంచుకునేవారు. నమ్మకం కలిగించాక ఏకాంతంగా కలుద్దామంటూ ప్రైవేట్ గదులకు రప్పించేవారు. అక్కడ బాధితులకు మత్తుమందు కలిపిన పదార్థాలు లేదా పానీయాలు ఇచ్చేవారు. వారు మత్తులోకి వెళ్లగానే నగదు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు దోచుకుని పరారయ్యేవారు. నిందితుల నుంచి సుమారు 35 తులాల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితుల వద్ద విలువైన వస్తువులు లేకపోతే వారి వ్యక్తిగత వీడియోలను రికార్డు చేసి, బయటపెడతామని బెదిరించి డబ్బులు వసూలు చేసేవారని విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠా బారిన ఇంకా ఎంతమంది పడ్డారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. డేటింగ్ యాప్‌లలో అపరిచితులతో పరిచయాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

జేఎన్‌టీయూలో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) క్యాంపస్‌లో విషాదం చోటుచేసుకుంది. బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి హాస్టల్ భవనం నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కూకట్‌పల్లిలోని గౌతమ్ బాయ్స్ హాస్టల్‌లో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన విక్రమ్ బాబు (19) జేఎన్‌టీయూలో మెకానికల్ ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో హాస్టల్ భవనం నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. హాస్టల్ అధికారులు

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ భేటీ

ఓపీఎస్ పునరుద్ధరణ సహా 41 డిమాండ్లు



హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఉద్యోగుల జేఏసీ కార్యాచరణకు సిద్ధమవుతోంది. సోమవారం హైదరాబాద్‌లోని రెవెన్యూ భవన్‌లో జేఏసీ ఛైర్మన్ వి. లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ నేతృత్వంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణకు తక్షణమే కమిటీ ఏర్పాటు చేసి అధ్యయనం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ బోర్డును పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసే ప్రతిపాదన నేపథ్యంలో అక్కడ పనిచేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగుల ప్రయోజనాలకు భరోసా కల్పించాలని కోరారు. రెండో వేతన సవరణ సంఘం (2వ పీఆర్‌సీ) సిఫార్సులను 2023 జూలై 1 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మార్పుపై చర్చలు జరిగినప్పుడు సమగ్ర అధ్యయనం కోసం ప్రత్యేక కమిటీ వేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హామీ ఇచ్చారని జేఏసీ నేతలు గుర్తుచేశారు. నెలలు గడుస్తున్నా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో అనుబంధ సంఘాలతో చర్చించి ప్రభుత్వ పెద్దలను ఒప్పించేలా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్. రాములు, కె. హన్మంతరావు, బి. కృపాకర్‌రెడ్డి, బాణాల రామిరెడ్డి, డా. జి. నిర్మల, ఎల్. దర్శన్‌గౌడ్, షేక్ హబీబ్ మియా, గరికె ఉపేంద్రరావు, ఎస్.వి. సుబ్బయ్య, కె. మహిపాల్‌రెడ్డి, చి. రవి, ఎస్. నర్సింహులు, రొక్కం దేవిక, బి. సుదర్శన్‌గౌడ్, ఎం. చంద్రశేఖర్‌గౌడ్, కె. సాయిరెడ్డి, పి. లక్ష్మయ్య, తొంట సత్యనారాయణ, ఆవుల సైదులు, శిరందాసు రాందాస్, డా. రామకృష్ణ, కె. సందీప్‌కుమార్, మహ్మద్ మొయినుద్దీన్, ముకుందరెడ్డి మామిడి, ఎ. శ్రీకాంత్‌గౌడ్, హేమలత, టి. జయప్రకాశ్, సుగంధిని, ఎస్. వివేక్, కుమార్ యారా, ఎం.డి. అజీజ్, రమేష్ పాక, ఫూల్ సింగ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్ వ్యాఖ్యలపై బీజేపీ ఫిర్యాదు

ఇటలీ నేతపై చర్యలకు డిమాండ్



హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన భారత్ సమ్మిట్‌లో విదేశీ రాజకీయ ప్రతినిధులు చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునేలా, దేశానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం ఫారెనర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ)కు ఫిర్యాదు చేసింది. నవంబర్ 12 నుంచి 14 వరకు హైదరాబాద్‌లో జరిగిన ఈ సదస్సులో విదేశీ ప్రతినిధులు చేసిన ప్రసంగాలు దేశ సమగ్రతకు భంగం కలిగించేలా ఉన్నాయని బీజేపీ నేతలు ఆరోపించారు. ఇటలీకి చెందిన యూరోపియన్ సోషలిస్ట్ పార్టీ నాయకుడు జియాకోమో ఫిలిబెక్ భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని రామచందర్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉపయోగిస్తున్న 'ఓట్ చోర్.. గద్దీ చోడ్' నినాదాన్ని ఆయన ప్రస్తావించడం భారత అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడమేనని విమర్శించారు. వీసా నిబంధనలకు విరుద్ధంగా సదరు నేత వ్యవహరించారని రామచందర్‌రావు ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో వేదికపై ఉన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చప్పట్లు కొట్టడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నవ్వడం దేశాన్ని అవమానించడమేనని విమర్శించారు. ఈ వ్యవహారంపై రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారెనర్స్ చట్టంలోని సెక్షన్ 23 ప్రకారం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే విదేశీయులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొంటూ ఫిలిబెక్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన దేశం విడిచి వెళ్లిపోయారని, తిరిగి రప్పించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సదస్సు నిర్వాహకులపైనా కేసులు నమోదు చేయాలని కోరారు. సమ్మిట్ నిర్వాహకులు, హాజరైన వారి నేపథ్యంపై సమగ్ర దర్యాప్తు జరపాలని రామచందర్‌రావు విజ్ఞప్తి చేశారు. జార్జ్ సోరోస్ వంటి శక్తుల నుంచి నిధులు పొంది, ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాలని కోరారు.

బంగాళాఖాతంలో వరుసగా 3 తుఫానులు

ఎల్‌నినో ప్రభావమే కారణమా?



హైదరాబాద్, నవంబర్ 16(ఈవార్తలు): బంగాళాఖాతంలో స్వల్ప వ్యవధిలో వరుసగా మూడు తుఫానులు ఏర్పడటం అరుదైన వాతావరణ పరిణామంగా నిపుణులు పేర్కొంటున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న ఎల్‌నినో ప్రభావంతో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగి, అల్పపీడనాలు వేగంగా తుఫానులుగా మారుతున్నాయని విశ్లేషిస్తున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఇప్పటికే అర్ణబ్, మురసు తుఫానులు ఏపీ తీరాన్ని తాకగా, ప్రస్తుతం అక్వాన్ తుపాను ముప్పు పొంచి ఉందని కథనంలో పేర్కొన్నారు. ఆగస్టు నుంచి ఎల్‌నినో క్రమంగా బలపడుతోందని, డిసెంబర్ నాటికి రికార్డు స్థాయికి చేరే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ, నిపుణులు అంచనా వేస్తున్నట్లు సమాచారం. దీని ప్రభావంతో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగి, ఈశాన్య రుతుపవనాలు చురుగ్గా మారుతున్నాయని చెబుతున్నారు. ఫలితంగా అల్పపీడనాలు వేగంగా బలపడుతున్నాయని వివరిస్తున్నారు. అక్టోబర్ 28న అర్ణబ్ తీవ్ర తుపాను గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 150 కిలోమీటర్ల వేగంతో నరసాపురం వద్ద తీరం దాటినట్లు కథనంలో పేర్కొన్నారు. నవంబర్ 3న మురసు తుపాను గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఒంగోలు సమీపంలో తీరాన్ని తాకినట్లు తెలిపింది. ప్రస్తుతం అగ్నేయ, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం మరింత బలపడుతోందని వాతావరణ శాఖ వెల్లడించినట్లు సమాచారం. నవంబర్ 16 సాయంత్రానికి తుపానుగా, మంగళవారం సాయంత్రానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అంచనా వేసింది. నవంబర్ 20న నెల్లూరు-తుని మధ్య తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించినట్లు కథనంలో పేర్కొన్నారు. ఈ తుపానుకు ఇరాన్ సూచించిన 'అక్వాస్' అనే పేరును ఖరారు చేశారు. తుఫానుల సంఖ్య కంటే అవి వేగంగా తీవ్రరూపం దాల్చే వేగం పెరుగుతోందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర విశ్లేషించినట్లు కథనం తెలిపింది. ఎల్‌నినో సంవత్సరాల్లో రుతుపవనాల అనంతర కాలంలో బంగాళాఖాతంలోని తక్కువ అక్షాంశాల వద్ద అల్పపీడనాలు ఏర్పడుతుంటాయని, దీంతో ఏపీ, తమిళనాడు తీరాలపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆయన వివరించినట్లు పేర్కొంది. ఎల్‌నినో సమయంలో ఈశాన్య రుతుపవనాలు బలపడి దక్షిణాది రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని మాజీ ఐఎండీ డీజీ కేజే రమేశ్ తెలిపినట్లు వెల్లడించింది.

ఇన్‌స్టాగ్రామ్ స్నేహంతో నగల చోరీ

విశాఖపట్నం, నవంబర్ 16 (ఈవార్తలు): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ యువతి స్నేహం పేరుతో ఓ కుటుంబాన్ని నమ్మించి, వారి ఇంట్లోనే నగలు దొంగిలించిన ఘటన విశాఖపట్నంలో వెలుగులోకి వచ్చింది. అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన ఓ మహిళతో పరిచయం పెంచుకున్న యువతి, ఆమె ఇంట్లో కొన్ని రోజులు ఉండి వజ్ర, బంగారు ఆభరణాలతో పరారైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కయ్యపాలెంకు చెందిన మహిళకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఓ యువతి పరిచయమైంది. కొద్దిరోజుల్లోనే ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. ఈ క్రమంలో ఆ యువతి బాధితురాలి ఇంటికి వచ్చింది. తనకు అనారోగ్యంగా ఉందని చెప్పి కొన్ని రోజులు అక్కడే ఉండేందుకు ఆశ్రయం కోరింది. ఆమె మాటలు నమ్మిన కుటుంబ సభ్యులు ఇంట్లో చోటు కల్పించారు. కొన్ని రోజులు గడిచాక అదును చూసి బీరువాలో ఉన్న 11.3 గ్రాముల వజ్రాల నెక్లెస్‌తో పాటు మరికొన్ని బంగారు ఆభరణాలను తీసుకుని యువతి పరారైంది. మోసపోయినట్లు గుర్తించిన బాధితులు ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

బస్సుల కోసం ఇంకెన్నాళ్లీ పడిగాపులు

కొడిమ్యాల, నవంబర్ 16 (ఈవార్తలు): మండలంలోని చెప్యాల ఎక్స్‌రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సుల రాకపోకలు అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోందని, తీరా బస్సులు వచ్చినప్పుడు ఒకేసారి రెండు మూడు బస్సులు వరుసగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఆఫీసులు, పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే వారికి ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా మారింది. ఒక బస్సు వెళ్లిపోయిన తర్వాత మరో బస్సు రావడానికి అరగంటకు పైగా సమయం పడుతోందని ప్రయాణికులు చెబుతున్నారు. ఆ తర్వాత ఒకే రూట్‌కు చెందిన బస్సులు వరుసగా రావడంతో మొదటి బస్సులో విపరీతమైన రద్దీ ఉంటోందని, కొందరు ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు. సంబంధిత డిపో మేనేజర్లు, ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సుల రాకపోకలను పర్యవేక్షించాలని, నిర్దిష్ట సమయాలకు బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొడిమ్యాలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొడిమ్యాల, నవంబర్ 16 (ఈవార్తలు): కొడిమ్యాల మండలంలోని గంగారాం తండా, సూరంపేట, కొనాపూర్ గ్రామాల్లో సెర్ప్ (ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు వినోద్, గంగవ్వ, ఎంపీడీవో స్వరూప, డిప్యూటీ తహసీల్దార్ పాల్గొని కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధికారులు భూషణ్‌రెడ్డి, ఏపీఎం మల్లేశం, సీసీలు వీర కుమార్, కమల, మంగ, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

గంజాయి, మాదకద్రవ్యాల కట్టడికి పోలీసుల ప్రత్యేక నిఘా

ఎండపల్లి, నవంబర్ 16 (ఈవార్తలు): గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణకు జగిత్యాల జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు యాంటీ డ్రగ్ అండ్ నార్కోటిక్ టీమ్ ఆధ్వర్యంలో సోమవారం ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ పురుషోత్తంరెడ్డి సూచనలతో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో వెల్గటూర్ ఎస్సై ఉదయ్‌కుమార్ బృందం వివేకానంద చౌరస్తా పరిసరాల్లో తనిఖీలు చేపట్టింది. కిరాణా దుకాణాలు, టీ స్టాళ్ల, పాన్ షాపులు, బస్టాండు, అనుమానాస్పద ప్రాంతాలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. వాటి వినియోగం ఆరోగ్యంతోపాటు కుటుంబ, సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు తనిఖీలు, ప్రత్యేక నిఘా కొనసాగుతాయని తెలిపారు.



ఫీజు చెల్లించలేదని విద్యార్థికి శిక్ష!

ఎండలో నిలబెట్టి, ముక్కు నేలకు రాయించారని తండ్రి ఆరోపణ

రాయికల్/జగిత్యాల, నవంబర్ 16 (ఈవార్తలు): ఫీజు చెల్లించలేదనే కారణంతో విద్యార్థికి అమానుషంగా శిక్ష విధించారంటూ రాయికల్‌లోని విశ్వశాంతి పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై ఆరోపణలు వచ్చాయి. ముక్కు నేలకు రాయించి ఎండలో నిలబెట్టడంతో బాలుడి కాలుకు గాయాలయ్యాయని అతడి తండ్రి ఆరోపించారు. అప్పటి నుంచి భయపడుతున్న కుమారుడు పాఠశాలకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా 2024లో పదో తరగతి పూర్తి చేసిన కుమార్తెకు మార్కుల మెమో, కుమారుడికి టీసీ ఇవ్వకుండా పాఠశాల యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తోందని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జగిత్యాలలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు పిల్లలకు అవసరమైన ధ్రువపత్రాలు ఇప్పించాలని అధికారులను కోరారు.



మిత్రుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల అండ

హనుమకొండ, నవంబర్ 16 (ఈవార్తలు): స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనంగా శ్రీ గురుకుల విద్యాలయం 1998-99 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిలిచారు. తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు ఈ. రాజు అకాల మరణంతో ఆయన కుటుంబం కష్టాల్లో పడటాన్ని చూసి చలించిపోయారు. మిత్రుడి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఆర్థిక సాయం అందించారు. హనుమకొండ జిల్లా ఐలాపోని మండలం నందనం గ్రామానికి చెందిన రాజు కుమారుల భవిష్యత్తు అవసరాల కోసం బ్యాచ్ మిత్రులంతా కలిసి రూ.లక్ష సేకరించారు. ఆ మొత్తాన్ని పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడేలా పోస్టాఫీసులో డిపాజిట్ చేశారు. మిత్రుడిని కోల్పోయిన కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు, పిల్లల భవిష్యత్తుకు తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కోటి రెడ్డి, నంద నాయక్, నార్దీప్ రెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన వారి సేవాభావాన్ని పలువురు అభినందించారు.



జగిత్యాలలో శ్మశానవాటిక, ఈద్గాకు స్థలం కేటాయించాలి

ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడిన అసదుద్దీన్ ఒవైసీ

జగిత్యాల, నవంబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో ముస్లింల జనాభా నిష్పత్తికి అనుగుణంగా శ్మశానవాటిక, ఈద్గా నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కోరారు. ఈ విషయమై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. హైదరాబాద్‌లోని దారుస్సలాంలో అసదుద్దీన్ ఒవైసీని జగిత్యాల ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ సమీర్‌దుద్దీన్ ఆజాద్, కోరుట్ల అధ్యక్షుడు మహమ్మద్ రాఫీ, మెట్‌పల్లి అధ్యక్షుడు మహమ్మద్ అఖీల్, జగిత్యాల కౌన్సిలర్లు మహమ్మద్ రజియుద్దీన్, మహమ్మద్ నౌమాన్ కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని మైనారిటీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జగిత్యాలలో ముస్లింలకు శ్మశానవాటిక, ఈద్గా నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని సమీర్‌దుద్దీన్ ఆజాద్ విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు వెల్లడించారు.



జగిత్యాలలో 26 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

జగిత్యాల, నవంబర్ 16 (ఈవార్తలు): అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ ఎల్. రమణ సోమవారం పంపిణీ చేశారు. జగిత్యాలలోని తన క్యాంపు కార్యాలయంలో 26 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.4,80,500 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న వైద్య ఖర్చులతో పేద కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని, ఇలాంటి పరిస్థితుల్లో సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. అర్హులైన పేదలకు వైద్య సాయం అందించేందుకు తన కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, మాజీ జెడ్పీటీసీ కొలముల రమణ, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'ఎస్ఆర్' వార్షిక క్రీడా పోటీలు



హైదరాబాద్, నవంబర్ 16 (ఈవార్తలు): ఎస్ఆర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి వార్షిక క్రీడా పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడంతో పాటు, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే తత్వం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ క్రీడా వేడుకల్లో మొత్తం 16 పాఠశాలలు పాల్గొన్నాయి. వివిధ క్రీడా విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. సంస్థల వ్యవస్థాపకులు, చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్ ఎ. సంతోష్ రెడ్డి ఈ క్రీడా పోటీల నిర్వహణకు అవకాశం కల్పించడంతో పాటు ప్రోత్సాహం అందించారు. హైదరాబాద్ స్కూల్స్ డీజీఎం కె. రాధికా రెడ్డి మార్గదర్శకత్వంలో, జోనల్ ఇన్‌చార్జ్‌లు ఎం. మనోహర్, రాధికా రెడ్డి సమన్వయంతో పోటీలు నిర్వహించారు. కొంపల్లి, దిల్‌సుఖ్‌నగర్ జోన్ల పరిధిలోని ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది క్రీడా పోటీల నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో పోటీపడుతూ తమ ప్రతిభను ప్రదర్శించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, పరస్పర సహకారం, క్రమశిక్షణతో ముందుకు సాగడం వంటి విలువలను ఈ పోటీలు విద్యార్థులకు నేర్పించాయి. విద్యతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్ర వికాసానికి ఎస్ఆర్ విద్యాసంస్థలు అందిస్తున్న ప్రోత్సాహం ఈ వార్షిక క్రీడా వేడుకల ద్వారా మరోసారి వెల్లడైంది. 16 పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది భాగస్వామ్యంతో క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.

చల్గల్‌కు మార్కెట్ తరలించాలి
రైతులకు మద్దతు ధర కల్పించాలి

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని జీవన్‌రెడ్డి ధర్నా



జగిత్యాల, నవంబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని బీట్ బజార్ మార్కెట్‌ను పూర్తిస్థాయిలో చల్గల్ మార్కెట్ యార్డుకు తరలించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావా వసంత సురేశ్‌తో కలిసి బీట్ బజార్ మార్కెట్‌ను సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని, మార్కెట్‌లో స్థలం కొరతతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ 2009లో తానే 25 ఎకరాల స్థలం కేటాయించి మార్కెట్ ఏర్పాటు చేశానన్నారు. మున్సిపల్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా ఇంకా వినియోగంలోకి తీసుకురాకపోవడంపై విమర్శలు చేశారు. గతంలో క్వింటాల్‌కు రూ.3,000 పలికిన ధర ప్రస్తుతం రూ.2,200కు పడిపోయిందని, జిల్లాలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదని ఆరోపించారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు మార్కెట్‌కు వస్తున్నారని తెలిపారు. చల్గల్ మార్కెట్‌లో వేయింగ్ బ్రిడ్జి సదుపాయం ఉన్నందున మార్కెట్‌ను అక్కడికి తరలించి, వ్యాపారులతో మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతులతో కలిసి నిజామాబాద్ జాతీయ రహదారిపై అరగంటపాటు బైఠాయించి ధర్నా నిర్వహించారు. పంట కొనుగోలు చేయాలని ఓ మహిళా రైతు సీఐ కాళ్లు మొక్కి వేడుకున్నారు. చల్గల్ మార్కెట్‌కు ధాన్యం తరలిస్తామని మార్కెట్ కార్యదర్శి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



దీక్షా దివస్‌కు చొప్పదండి నుంచి భారీగా తరలిరావాలి: సుంకె

గంగాధర, నవంబర్ 16 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా ఈ నెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా అలుగునూరులో జరిగే కార్యక్రమానికి చొప్పదండి నియోజకవర్గం నుంచి 10 వేల మందిని తరలించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ మేరకు గంగాధర మండలం బూరుగుపల్లిలోని బీఆర్ ఎస్ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దీక్షా దివస్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ప్రతి మండలం, గ్రామానికి కేటాయించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని సూచించారు.



ప్రారంభానికి నోచుకోని పంచాయతీ భవనం

ప్రభుత్వ నిధులతో నిర్మించినా ప్రజలకు అందని సేవలు

కొడిమ్యాల, నవంబర్ 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని అప్పారావుపేట గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభానికి నోచుకోకుండా నిరుపయోగంగా ఉంది. భవన నిర్మాణం పూర్తయి, కాంట్రాక్టర్‌కు రూ.17,28,000 నిధులు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు ప్రజల వినియోగంలోకి తీసుకురాలేదు. గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఈ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారినా పట్టించుకునే వారు లేకుండా పోయారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం పూర్తయిన భవనాన్ని ఇప్పటివరకు ఎందుకు ప్రారంభించలేదు? ప్రజలకు ఎప్పుడు అందుబాటులోకి తీసుకువస్తారు? అని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి భవనాన్ని ప్రారంభించడంతోపాటు పరిసరాలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రజల అవసరాలకు ఉపయోగపడాలి తప్ప నిరుపయోగంగా ఉండకూడదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కొడిమ్యాల మండల సోషల్ మీడియా కన్వీనర్ పండుగు శ్రీకాంత్ కోరారు.

ధర్మపురి అభివృద్ధి బాధ్యత నాదే: అడ్లూరి

ధర్మపురి, నవంబర్ 16 (ఈవార్తలు): ధర్మపురి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సోమవారం ధర్మపురి మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 15 వార్డులకు చెందిన 165 మంది కొత్త చేయూత పింఛనుదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పింఛన్లు అందని అర్హులకు విడతలవారీగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ధర్మపురి పుష్కరాల అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రసునాంభ, డీఆర్డీఏ పీడీ రఘువరన్, మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్, వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

60 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రూ.17.40 లక్షల ఆర్థిక సాయం అందజేసిన ఆది శ్రీనివాస్



వేములవాడ అర్బన్, నవంబర్ 16 (ఈవార్తలు): అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద, మధ్య తరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం వేములవాడలోని తన క్యాంపు కార్యాలయంలో పట్టణ పరిధికి చెందిన 60 మంది లబ్ధిదారులకు రూ.17.40 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా నిస్తోందన్నారు. ఆర్థిక స్థోమత లేక వైద్యం చేయించుకోలేని వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

చందుర్తిలో 502 మందికి చేయూత పింఛన్లు



చందుర్తి, నవంబర్ 16 (ఈవార్తలు): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో 502 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులకు చేయూత అందించి వారి జీవితాల్లో భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. సంక్షేమ పథకాలను ప్రకటించడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ఫలాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పేదల ముఖాల్లో చిరునవ్వు, ప్రతి కుటుంబంలో ఆత్మవిశ్వాసం, ప్రతి లబ్ధిదారుడి జీవితంలో భరోసా కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. పింఛన్ మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి..

విషాదంలోనూ నేత్రదానం



మల్యాల, నవంబర్ 16 (ఈవార్తలు): జాతీయ రహదారి దాటుతున్న వృద్ధుడిని కారు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూకపల్లి శివారులో చోటుచేసుకుంది. కుటుంబ పెద్దను కోల్పోయిన విషాదంలోనూ ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దుట్ల గ్రామానికి చెందిన చుంచుల నడిపి మల్లయ్య (67) సోమవారం ఉదయం 9.40 గంటల సమయంలో నూకపల్లి శివారులోని మహాలక్ష్మి మార్ట్ వద్ద కొబ్బరికాయలు కొనుగోలు చేసేందుకు జాతీయ రహదారి-563 దాటుతున్నారు. అదే సమయంలో కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న బాలెనో కారు ఆయనను ఢీకొట్టింది. ముత్యంపేట గ్రామానికి చెందిన డ్రైవర్ చేన్నవేని మాధవన్ అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో మల్లయ్య తలకు తీవ్ర గాయమై, అధిక రక్తస్రావం కావడంతో వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య చుంచుల రాజవ్వ ఫిర్యాదు మేరకు మల్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు మల్లయ్య నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు దానం చేశారు. ఈ నిర్ణయాన్ని మల్యాల పోలీసులు అభినందించారు. మరణానంతరం కూడా మరొకరికి చూపునిచ్చే నేత్రదానంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, ఇలాంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని పోలీసులు పిలుపునిచ్చారు.

ధర్మపురి అభివృద్ధి బాధ్యత నాదే: అడ్లూరి

ధర్మపురి, నవంబర్ 16 (ఈవార్తలు): ధర్మపురి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సోమవారం ధర్మపురి మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 15 వార్డులకు చెందిన 165 మంది కొత్త చేయూత పింఛనుదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం పింఛన్లు అందని అర్హులకు విడతలవారీగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ధర్మపురి పుష్కరాల అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రసునాంభ, డీఆర్డీఏ పీడీ రఘువరన్, మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్, వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ధరల దెబ్బకు కేరళలో హోటళ్ల సంక్షోభం

ఆహార ద్రవ్యోల్బణం 10.92 శాతం.. తగ్గిన కస్టమర్లు, పెరిగిన నిర్వహణ ఖర్చులు

తిరువనంతపురం, నవంబర్ 16 : కేరళలో ఆహార పదార్థాల ధరలు భారీగా పెరగడంతో హోటళ్లు, రెస్టారెంట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నిత్యావసరాల ధరలతో పాటు కమర్షియల్ గ్యాస్ ఖర్చులు పెరగడం, మరోవైపు కస్టమర్లు తగ్గిపోవడంతో వ్యాపారాలు నడపడం కష్టంగా మారిందని హోటళ్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆహార ద్రవ్యోల్బణం 8.94 శాతంగా ఉండగా, కేరళలో 10.92 శాతానికి చేరిందని కేరళ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ (కేహెచ్ఆర్ఏ) తెలిపింది. బియ్యం, ఉల్లిపాయలు, కూరగాయలు, వంట నూనెలు, కిరాణా సరుకులతో పాటు కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల ధరలు పెరగడంతో చిన్న, మధ్య తరహా హోటళ్లు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయి. ఖర్చులు పెరిగినా మెనూ ధరలు పెంచలేని పరిస్థితి ఉందని యజమానులు చెబుతున్నారు. ఇప్పటికే ధరల భారంతో సామాన్య కుటుంబాలు హోటళ్లకు వెళ్లడం తగ్గించాయని, పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే బయట భోజనానికి ఆసక్తి చూపుతున్నాయని పేర్కొంటున్నారు. జీవన వ్యయం పెరగడంతో సిబ్బంది జీతాలు పెంచాలనే డిమాండ్లు కూడా యాజమాన్యాలకు భారంగా మారాయి. మెనూ ధరలు పెంచితే ఉన్న కస్టమర్లు కూడా దూరమయ్యే ప్రమాదం ఉందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.జయపాల్, ప్రధాన కార్యదర్శి ఎన్.అబ్దుల్ రజాక్ తెలిపారు. కమర్షియల్ గ్యాస్‌పై జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమ నిల్వలు, అనవసరంగా ధరలు పెంచడంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హోటల్ రంగంపై యజమానులతో పాటు వంటవారు, సరఫరాదారులు, రైతులు సహా లక్షలాది మంది ఉపాధి ఆధారపడి ఉందని గుర్తుచేశారు. మరోవైపు నిత్యావసరాల కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచితే చర్యలు తీసుకుంటామని కేరళ పౌర సరఫరాల శాఖ హెచ్చరించింది. అవసరమైతే ఓనం సమయంలో మాదిరిగా అదనపు నిల్వలను మార్కెట్లోకి విడుదల చేస్తామని తెలిపింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ధరల ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



ప్రవేశ పరీక్షల్లో జంధ్యం తొలగించాల్సిన అవసరం లేదు

కర్ణాటక హైకోర్టుకు కేఈఏ స్పష్టత.. పిటిషన్ పరిష్కారం

బెంగళూరు, నవంబర్ 16 : కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (సీఈటీ) రాసే విద్యార్థులు జంధ్యం ధరించడంపై ఎలాంటి నిషేధం లేదని కర్ణాటక పరీక్షల ప్రాధికార సంస్థ (కేఈఏ) హైకోర్టుకు స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల జంధ్యాన్ని బలవంతంగా తొలగించాలనే నిబంధనలు తమ మార్గదర్శకాల్లో లేవని తెలిపింది. 2025లో నిర్వహించిన పరీక్షల సమయంలో కొందరు విద్యార్థుల జంధ్యాలను తొలగించిన ఘటనలపై అఖిల కర్ణాటక బ్రాహ్మణ మహాసభ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ అను శివరామన్, జస్టిస్ కేఎస్ భరత్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా కేఈఏ అధికారులు కోర్టుకు వివరాలు సమర్పించారు. జంధ్యం తీసివేయాలనే నిబంధన ఎక్కడా లేదని, 2025-26 పరీక్షల సమయంలో జరిగిన ఒకటి రెండు ఘటనలపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా అన్ని జిల్లాల డిప్యూటీ కమిషనర్లు, పరీక్షల నిర్వహణ అధికారులు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. ఈ ఘటనలపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కూడా వివరణ కోరాయని, తీసుకున్న చర్యలపై నివేదికలు సమర్పించామని కేఈఏ తెలిపింది. కేఈఏ ఇచ్చిన వివరణ, హామీలను రికార్డుల్లోకి తీసుకున్న హైకోర్టు పిటిషన్‌ను పరిష్కరించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశ పరీక్షలు ఒకే విధంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.

ఎల్‌టీసీజీ పన్ను మార్పులపై బడ్జెట్ వరకూ ఆగాల్సిందే

ప్రతిపాదనలపై చర్చలు కొనసాగుతున్నాయి: సీబీడీటీ చైర్మన్

న్యూఢిల్లీ, నవంబర్ 16 : దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) విధానంలో మార్పులపై వచ్చే కేంద్ర బడ్జెట్‌కు ముందు తుది నిర్ణయం తీసుకునే అవకాశం లేదని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) చైర్మన్ రవి అగర్వాల్ తెలిపారు. వివిధ వర్గాల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో పన్ను చెల్లింపుదారుల లాంజ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్‌టీసీజీ పన్ను విధానాన్ని సరళీకరించాలని పరిశ్రమల సంఘాలు, పెట్టుబడిదారులు, మార్కెట్ వర్గాలు కోరుతున్నాయని చెప్పారు. పన్ను రేట్లు, మినహాయింపుల నిబంధనల్లో మార్పులపై ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిపారు. 2027-28 కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో ఈ అంశంపై ఆసక్తి నెలకొందన్నారు. ఆదాయపు పన్ను రిఫండ్ల జారీ ప్రక్రియలో మెరుగుదల కనిపించిందని రవి అగర్వాల్ తెలిపారు. గత ఏడాది రిఫండ్లలో జాప్యం జరిగినప్పటికీ, ఈసారి ప్రక్రియను క్రమబద్ధీకరించడం వల్ల చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే రిఫండ్ల మొత్తం 25 శాతం పెరిగిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు అంచనాల కంటే కొంత తక్కువగా ఉన్నాయని అంగీకరించారు. అయినప్పటికీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రూ.26.97 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

టీవీఎస్ కుటుంబంలో ఆస్తుల వివాదం

సమాన వాటా కోరుతూ తండ్రికి లక్ష్మీ వేణు లీగల్ నోటీసు

చెన్నై, నవంబర్ 16 : ప్రముఖ వ్యాపార సంస్థ టీవీఎస్ గ్రూప్‌కు చెందిన వేణు శ్రీనివాసన్ కుటుంబంలో ఆస్తుల వివాదం తెరపైకి వచ్చింది. ఉమ్మడి కుటుంబ ఆస్తుల్లో తనకు సమాన వాటా ఇవ్వాలని కోరుతూ ఆయన కుమార్తె లక్ష్మీ వేణు లీగల్ నోటీసు పంపారు. టీవీఎస్ మోటార్ కంపెనీ చైర్మన్ ఎమెరిటస్ వేణు శ్రీనివాసన్‌కు ఆస్తుల విభజనకు సంబంధించిన నోటీసు అందజేశారు. ఏఎన్ఐ కథనం ప్రకారం.. హిందూ వారసత్వ చట్టం-1956లోని 2005 సవరణ ప్రకారం కుమార్తెగా ఉమ్మడి కుటుంబ ఆస్తుల్లో తనకు సమాన హక్కు ఉందని లక్ష్మీ వేణు పేర్కొన్నారు. కుటుంబ పెద్దగా తండ్రి న్యాయమైన రీతిలో ఆస్తులను విభజించాలని కోరారు. 2020లో టీవీఎస్ గ్రూప్‌లో కుదిరిన కుటుంబ ఒప్పందం ద్వారా వీఎస్ ట్రస్ట్, ఇతర హోల్డింగ్ సంస్థల పరిధిలోకి వచ్చిన ఆస్తులను నోటీసులో ప్రస్తావించారు. టీవీఎస్ హోల్డింగ్స్, టీవీఎస్ మోటార్ కంపెనీ, టీవీఎస్ క్రెడిట్ సర్వీసెస్, సుందరం-క్లేటన్ సంస్థల్లోని వాటాలు ఇందులో ఉన్నాయి. 2020 నాటి ఒప్పందం గ్రూప్ స్థాయిలో మాత్రమే జరిగిందని, తమ కుటుంబంలో ఆస్తుల పంపకాలు జరగలేదని లక్ష్మీ వేణు పేర్కొన్నారు. వ్యాపారాల నిర్వహణ అధికారం ఉన్నంత మాత్రాన పూర్తి యాజమాన్య హక్కు ఉన్నట్లు కాదన్నారు. కుటుంబ ఆస్తుల ప్రయోజనాలన్నీ తన సోదరుడు సుదర్శన్ వేణుకే దక్కేలా చేశారని, తనను ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టారని ఆరోపించారు. కుమార్తెల చట్టబద్ధమైన హక్కులను ఏకపక్ష నిర్ణయాలతో కాలరాయలేరని లక్ష్మీ వేణు స్పష్టం చేశారు. ఆమె డిమాండ్‌కు తల్లి మల్లికా శ్రీనివాసన్ కూడా మద్దతు ప్రకటించినట్లు కథనం పేర్కొంది.



భారత్ ఏఐ విధానం భేష్!

యూరప్‌లా కఠిన నియంత్రణలు లేవు

ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ

న్యూఢిల్లీ, నవంబర్ 16 : ప్రపంచ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ మరింత కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని ఐబీఎం చైర్మన్, సీఈఓ అరవింద్ కృష్ణ అభిప్రాయపడ్డారు. ఏఐ విషయంలో భారత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని ఆయన ప్రశంసించారు. యూరప్ మాదిరిగా కఠిన నియంత్రణలు విధించకుండా, కొత్త ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడం మంచి నిర్ణయమని పేర్కొన్నారు. తాజాగా ఓ వార్తా సంస్థతో మాట్లాడిన ఆయన.. యూరప్‌లో కఠిన నిబంధనల కారణంగా ఏఐ ఎకోసిస్టమ్ దాదాపుగా లేకుండా పోయిందని అభిప్రాయపడ్డారు. ఆధార్, డిజిటల్ పేమెంట్లు, క్విక్ కామర్స్ వంటి రంగాల్లో భారత్ మంచి విజయాలు సాధించిందని గుర్తుచేశారు. అయితే ప్రపంచ ఏఐ రంగంలో భారత్ తన స్థానాన్ని మరింత స్పష్టంగా నిర్ణయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశీయంగా అభివృద్ధి చేసిన ఏఐ టెక్నాలజీని ప్రోత్సహించడంతో పాటు ప్రభుత్వ సేవల్లో దాన్ని ఉపయోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. అదే సమయంలో ఏ కంపెనీలు విజయం సాధించాలో ప్రభుత్వమే నిర్ణయించడం ప్రమాదకరమని హెచ్చరించారు. పారిశ్రామిక విధానాల పేరుతో కొన్ని సంస్థలను మాత్రమే ప్రోత్సహించడం మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ఐబీఎంకు భారత్ ప్రపంచవ్యాప్తంగా కీలక భాగస్వామిగా ఉందని అరవింద్ కృష్ణ తెలిపారు. ఉత్పత్తుల తయారీతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఐబీఎంకు సేవలు అందించే నిపుణులు భారత్‌లో ఉన్నారని చెప్పారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 'ఇండియా ఏఐ గవర్నెన్స్ గైడ్‌లైన్స్' పేరుతో మార్గదర్శకాలను విడుదల చేసింది. బాధ్యతాయుతమైన ఏఐ ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారం, అల్గారిథమిక్ బయాస్ వంటి సమస్యలను నియంత్రించడం వీటి లక్ష్యం. ఏఐ గవర్నెన్స్ గ్రూప్, టెక్నాలజీ అండ్ పాలసీ ఎక్స్‌పర్ట్ కమిటీ, ఏఐ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటును కూడా ప్రతిపాదించారు.



ఫస్ట్ నేను బతికి ఉండాలె: ఇమ్రాన్ ఖాన్



ఇస్లామాబాద్, నవంబర్ 16 : తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలంటే ముందుగా ప్రాణాలతో ఉండాలని పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. జైలులో తన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నారని, తనతో పాటు భార్య బుష్రా బీబీకి తక్షణ వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దేశంలోని ముగ్గురు ప్రధాన న్యాయమూర్తులకు లేఖ రాశారు. సమయం మించిపోకముందే న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పాకిస్తాన్ ప్రధాన న్యాయమూర్తి, ఫెడరల్ కాన్స్టిట్యూషనల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇస్లామాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఈ లేఖ పంపారు. ఇమ్రాన్ న్యాయవాది సల్మాన్ సఫ్దార్ దాన్ని ఎక్స్‌లో విడుదల చేశారు. జైలు నిబంధనలు, రాజ్యాంగం కల్పించిన హక్కులను అధికారులు ఉల్లంఘిస్తున్నారని ఇమ్రాన్ ఆరోపించారు. తనకు న్యాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 70 ఏళ్ల వయసు వరకు తనపై ఒక్క క్రిమినల్ కేసు కూడా లేదని, ఆ తర్వాత రాజకీయ కక్ష సాధింపులు మొదలయ్యాయని ఇమ్రాన్ పేర్కొన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని, వందకు పైగా కోర్టు వాయిదాలకు హాజరయ్యానని తెలిపారు. హత్యాయత్నం నుంచి ప్రాణాలతో బయటపడ్డానని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చట్టబద్ధంగానే పోరాడానని చెప్పారు. అయితే 2025లో తోషఖానా కేసు తీర్పు తర్వాత తనను పూర్తిగా ఏకాంత నిర్బంధంలో ఉంచారని ఆరోపించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 10న సుప్రీంకోర్టు నియమించిన అమికస్ క్యూరీగా తన న్యాయవాది వచ్చి కలిసే వరకు కుడి కంటి చూపు 85 శాతం తగ్గిన విషయాన్ని కుటుంబానికి కూడా తెలియనివ్వలేదని పేర్కొన్నారు. ఏడాది మొత్తంలో న్యాయవాదిని కలిసేందుకు నాలుగుసార్లు మాత్రమే అనుమతించారని, తన భార్యకు ఒక్కసారి మాత్రమే న్యాయవాదితో మాట్లాడే అవకాశం కల్పించారని తెలిపారు. బుష్రా బీబీ కంటి సమస్య మరింత తీవ్రమైందని ఇమ్రాన్ చెప్పారు. ఏప్రిల్‌లో రెటీనా సర్జరీ జరిగిన వెంటనే ఆమెను మళ్లీ ఏకాంత నిర్బంధానికి తరలించారని, మరో సర్జరీ ఆలస్యమైతే కంటిచూపు శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

బీఎల్‌ఏ కొత్త చీఫ్‌గా పాక్ మాజీ ఆర్మీ కెప్టెన్!

ఇస్లామాబాద్, నవంబర్ 16 : పాకిస్తాన్‌లోని బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) కొత్త కమాండర్ ఇన్ చీఫ్‌గా పాక్ సైన్యంలో గతంలో కెప్టెన్‌గా పనిచేసిన రెహ్మాన్ గుల్ నియమితులైనట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ నియామకం బలోచిస్తాన్‌లో పాక్ భద్రతా దళాలకు మరిన్ని సవాళ్లు తెచ్చిపెట్టవచ్చని రక్షణ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. బీఎల్ఏ ఇటీవల తన దాడుల వ్యూహాలు, ఆయుధాల వినియోగం, సభ్యుల నియామక ప్రక్రియలో మార్పులు చేపట్టినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. గతంలో ఐఈడీలు, ఆకస్మిక దాడులపై ఎక్కువగా ఆధారపడిన ఈ సాయుధ సంస్థ ఇప్పుడు డ్రోన్లు, ఆధునిక ఆయుధాలను వినియోగిస్తున్నట్లు సమాచారం. సైనిక అవసరాలకు అనుగుణంగా మార్చిన క్వాడ్‌కాప్టర్లతో పాక్ భద్రతా దళాల కాన్వాయ్‌లు, గస్తీ బృందాలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు ఓ అధికారి వెల్లడించారు. పాక్ సైన్యంలో అసంతృప్తితో ఉన్న అధికారులు, సిబ్బందిని తమవైపు తిప్పుకునేందుకు బీఎల్ఏ ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసిందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. బలోచిస్తాన్‌లో సైనిక చర్యలు, బలవంతపు అదృశ్యాలు, మహిళలపై అఘాయిత్యాలు, అభివృద్ధి లోపం వంటి అంశాలపై కొందరు సైనికుల్లో అసంతృప్తి ఉందని నివేదికలు పేర్కొన్నాయి. రెహ్మాన్ గుల్ అలియాస్ మురీద్ బలోచ్ గతంలో పాక్ సైన్యంలోని 19వ ఫ్రాంటియర్ ఫోర్స్ రెజిమెంట్‌లో కమిషన్డ్ ఆఫీసర్‌గా పనిచేసినట్లు సమాచారం. బలోచిస్తాన్ విషయంలో ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ సైన్యం నుంచి బయటకు వచ్చి బీఎల్ఏలో చేరినట్లు కథనాలు తెలిపాయి. అనంతరం రెండో కమాండర్ స్థాయికి ఎదిగి, మజీద్ బ్రిగేడ్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నాయి. పాక్ సైనిక వ్యూహాలపై అవగాహన ఉన్న వ్యక్తి బీఎల్ఏ నాయకత్వంలోకి రావడం భద్రతా దళాలకు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

బిల్కిస్ బానో కేసులో ఇద్దరు దోషులకు బెయిల్

న్యూఢిల్లీ, నవంబర్ 16 : బిల్కిస్ బానో సామూహిక అత్యాచారం కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఇద్దరు దోషులకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బిపిన్‌చంద్ జోషి, ప్రదీప్ మోధియాల శిక్ష అమలును తాత్కాలికంగా నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికే 17 ఏళ్లకు పైగా జైలులో ఉండటం, వారి అప్పీల్‌లోని చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు పేర్కొంది. తమకు విధించిన శిక్షను సమర్థిస్తూ 2017 మేలో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ జోషి, మోధియా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా జోషి తీవ్ర వికలాంగుడనే అంశాన్ని కూడా ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. నేర తీవ్రతను దృష్టిలో పెట్టుకుని దోషులకు బెయిల్ ఇవ్వడాన్ని ప్రభుత్వ తరపు న్యాయవాది వ్యతిరేకించారు. అయితే దోషుల తరపు న్యాయవాది వాదిస్తూ.. ప్రాథమిక ఎఫ్ఐఆర్‌లో ఒక దోషి పేరు లేదని, ఘటన జరిగిన మూడేళ్ల తర్వాత కేసులో చేర్చారని పేర్కొన్నారు.

'ఓట్ చోర్' నినాదంతో ఇటలీ నేతకు వీసా చిక్కులు!

న్యూఢిల్లీ, నవంబర్ 16 : హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్‌లో 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' అంటూ నినాదం చేసిన ఇటలీ రాజకీయ నాయకుడు జియాకోమో ఫిలిబెక్ వీసా నిబంధనలను ఉల్లంఘించారంటూ వివాదం మొదలైంది. ఆయన కాన్ఫరెన్స్ వీసాపై భారత్‌కు వచ్చారని, విదేశీ పౌరులు భారత అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం నిబంధనలకు విరుద్ధమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. నవంబర్ 13, 14 తేదీల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూరోపియన్ సోషలిస్టుల పార్టీ (పీఈఎస్) ప్రధాన కార్యదర్శి ఫిలిబెక్.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రాచుర్యంలోకి తెచ్చిన 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' నినాదాన్ని వినిపించారు. సదస్సులు, సెమినార్లు, వర్క్‌షాప్‌లలో పాల్గొనేందుకు వచ్చే విదేశీయులకు కాన్ఫరెన్స్ వీసాలు జారీ చేస్తారు. ఫిలిబెక్ ఈ-వీసా పోర్టల్ ద్వారా వీసా పొందారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత అంతర్గత రాజకీయాలపై వ్యాఖ్యలు చేయడం వీసా నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నాయి. అయితే 'ఒక వ్యక్తి.. ఒక ఓటు' అనే ప్రజాస్వామ్య సూత్రాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని ఫిలిబెక్ వ్యాఖ్యానించారు. ఓటరు జాబితాల్లో పారదర్శకత కోసం ఆయన చేస్తున్న ప్రచారానికి మద్దతు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని ప్రజలే కాపాడుకోవాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ సమావేశాల ద్వారా ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న సవాళ్లను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లవచ్చని తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు.

దేశాన్ని విడగొట్టే కుట్రలు: మోహన్ భగవత్

జోధ్‌పూర్, నవంబర్ 16 : ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు అతిగా అలవాటు పడటం కూడా ఒకరకమైన వ్యసనమేనని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ అన్నారు. అన్ని రకాల వ్యసనాలు వ్యక్తి ఆలోచనా శక్తిని దెబ్బతీస్తాయని హెచ్చరించారు. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జరిగిన 'మారు నినాద్-2026' ఘోష్ శివిర్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యసనం అంటే కేవలం మత్తుపదార్థాలకు బానిస కావడం మాత్రమే కాదని, రోజూ తాగే టీ, కాఫీలు కూడా వ్యసనంగా మారవచ్చని భగవత్ పేర్కొన్నారు. కులం, భాష, రాష్ట్రం వంటి గుర్తింపులకు అతిగా ప్రాధాన్యం ఇవ్వడం కూడా ఒకరకమైన వ్యసనమేనని అభిప్రాయపడ్డారు. ఇలాంటి వాటికి దూరంగా ఉండటం వల్ల వ్యక్తిగతంగా, సామాజికంగా మంచి ఆలోచనా విధానం పెరుగుతుందని చెప్పారు. దేశాన్ని విభజించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని భగవత్ ఆరోపించారు. చిన్నచిన్న గుర్తింపులను అడ్డుపెట్టుకుని సమాజంలో విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఇది బ్రిటిష్ పాలకుల 'విభజించి పాలించు' విధానాన్ని గుర్తుచేస్తోందన్నారు. భారత్ బలమైన దేశంగా ఎదగడం కొన్ని ప్రపంచ శక్తులకు ఇష్టం లేదని, తమ ప్రయోజనాల కోసం దేశ పురోగతిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. బ్రిటిష్ పాలకులు భారత సంప్రదాయ విద్యావ్యవస్థను దెబ్బతీసి తమ విధానాలను రుద్దారని పేర్కొన్నారు. స్వార్థం, విభేదాలు, అహంకారాన్ని పక్కనపెట్టి దేశ సేవ కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ముంబై వీధుల్లో బ్రిటన్ రాజ దంపతుల సందడి

ముంబై, నవంబర్ 16 : బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియం, యువరాణి కేట్ మిడిల్టన్ మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా సోమవారం ముంబై చేరుకున్నారు. అధికారిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా నగరంలోని సాధారణ ప్రజలతో కలిసి సరదాగా గడిపారు. 2016 తర్వాత తొలిసారి భారత్‌కు వచ్చిన రాజ దంపతులకు బల్లార్డ్ ఎస్టేట్‌లో సంప్రదాయ ఢోల్-తాషా వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, స్థానిక గల్లీ క్రికెట్ టీమ్‌తో కలిసి క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విలియం బ్యాటింగ్ చేయగా, కేట్ కూడా బ్యాట్ పట్టారు. విలియం బౌలింగ్‌లో సచిన్ అవుట్ కావడం, కేట్ కొట్టిన బంతిని ఓ అభిమాని క్యాచ్ పట్టడం వంటి సరదా సన్నివేశాలు అక్కడివారిని ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత సమీపంలోని చెట్టు కింద ఉన్న సాధారణ టీ స్టాల్‌కు వెళ్లిన విలియం, కేట్, సచిన్ మట్టి కప్పుల్లో ముంబై ప్రత్యేకత అయిన కటింగ్ చాయ్ తాగారు. అనంతరం రాజ దంపతులు విధాన భవన్ స్టేషన్ నుంచి కొత్త మెట్రో రైలులో ప్రయాణించారు. పర్యటనలో భాగంగా జరిగిన 'ఎర్త్‌షాట్ ప్రైజ్' కార్యక్రమంలో ప్రిన్స్ విలియం పర్యావరణ పరిరక్షణపై మాట్లాడారు. భవిష్యత్తును 'రంగ్ బిరంగీ దునియా'గా అభివర్ణించారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణ రెండింటిలో ఏదో ఒకదాన్నే ఎంచుకోవాలనే ఆలోచనను మార్చుకోవాలని సూచించారు. పర్యావరణ సమస్యలకు పరిష్కారాలు చూపుతున్న వారికి పెట్టుబడులు, ప్రోత్సాహం అందించాలని కోరారు.

ఐసీఐసీఐ బ్యాంక్ ఎన్ఆర్ఐ ఖాతాల ఛార్జీల పెంపు

డిసెంబర్ 1 నుంచి కొత్త రేట్లు.. ప్రతి రూ.వెయ్యికి రూ.4 వసూలు

ముంబై, నవంబర్ 16 : ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంక్ ఐసీఐసీఐ తన ప్రవాస భారతీయుల (ఎన్ఆర్ఐ) సేవింగ్స్ ఖాతాలకు సంబంధించిన సర్వీస్ ఛార్జీలను సవరించింది. కొత్త ఛార్జీలు డిసెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ముఖ్యంగా నెలవారీ ఉచిత పరిమితి దాటిన తర్వాత చేసే నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్‌తో పాటు ఈసీఎస్ డెబిట్ రిటర్న్ ఛార్జీల్లో మార్పులు చేసింది. ఎన్ఆర్ఐ ప్రైవేట్ బ్యాంకింగ్, ప్రీమియా, సెలెక్ట్, ప్రో, రెగ్యులర్, సీఫేరర్, వర్ష్, స్పర్ష్ ఖాతాలకు కొత్త నిబంధనలు వర్తిస్తాయని బ్యాంక్ తెలిపింది. ఆగస్టు 4, 2025కు ముందు తెరిచిన ఖాతాలు కూడా ఇందులో ఉన్నాయి. సర్వీస్ ఛార్జీలకు అదనంగా జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. నెలవారీ ఉచిత విలువ పరిమితి దాటిన తర్వాత నగదు లావాదేవీలపై ఇప్పటివరకు ప్రతి రూ.వెయ్యికి రూ.3.50 వసూలు చేస్తుండగా, డిసెంబర్ 1 నుంచి రూ.4 వసూలు చేయనున్నారు. కనీస ఛార్జీ రూ.150గా నిర్ణయించారు. ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే అది వర్తిస్తుంది. సాధారణ ఎన్ఆర్ఐ ఖాతాలకు నెలకు మూడు నగదు డిపాజిట్లు, మూడు విత్‌డ్రాయల్స్ ఉచితంగా ఉంటాయి. ఆ తర్వాత ఒక్కో లావాదేవీకి రూ.150 ఛార్జీ ఉంటుంది. విలువ పరంగా నెలకు డిపాజిట్లకు రూ.లక్ష, విత్‌డ్రాయల్స్‌కు రూ.లక్ష వరకు ఉచిత పరిమితి కొనసాగుతుంది.

లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబై, నవంబర్ 16 : దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో కొనుగోళ్లు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడంతో ప్రధాన సూచీలు పుంజుకున్నాయి. సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా లాభపడింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 510.40 పాయింట్లు (0.63 శాతం) పెరిగి 82,102.85 వద్ద నిలిచింది. నిఫ్టీ 146.80 పాయింట్లు (0.58 శాతం) లాభపడి 25,291.10 వద్ద ముగిసింది. నిఫ్టీలో మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్, ఐటీసీ, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ షేర్లు ఎక్కువగా లాభపడ్డాయి. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగాల సూచీలు మెరుగైన పన



వయ్యారి చిత్రం



ఘనంగా తేజ సజ్జా నిశ్చితార్థం

ఈవార్తలు, వినోదవాణి: 'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో తేజ సజ్జా పెళ్లికి సిద్ధమవుతున్నారు. సోమవారం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఆయన నిశ్చితార్థ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై కాబోయే దంపతులను ఆశీర్వదించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావు, చిరంజీవి, రవితేజ, నాని, రానా, దర్శకుడు రాఘవేంద్రరావు, ప్రశాంత్ వర్మ తదితరులు వేడుకకు హాజరయ్యారు. నిశ్చితార్థానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తేజ వివాహం జరగనున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రైవేట్‌గా పెళ్లి వేడుక నిర్వహించి, ఆ తర్వాత హైదరాబాద్‌లో సినీ ప్రముఖులు, స్నేహితుల కోసం రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. తేజ వివాహం చేసుకోబోయే అమ్మాయి వివరాలను కుటుంబ సభ్యులు వెల్లడించలేదు. ఆమె ఐటీ రంగానికి చెందినవారని, పెద్దలు కుదిర్చిన సంబంధమని ప్రచారం జరుగుతోంది. 'హనుమాన్', 'మిరాయ్' విజయాల తర్వాత తేజ పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'జాంబిరెడ్డి', 'హనుమాన్' సినిమాల సీక్వెల్స్‌లోనూ నటించనున్నారు.



పాన్ ఇండియా ట్రెండ్ చిన్న సినిమాలను దెబ్బతీస్తోంది

ఈవార్తలు, వినోదవాణి: పాన్ ఇండియా సినిమా పేరుతో భారీ బడ్జెట్ చిత్రాలకు ప్రాధాన్యం పెరగడం వల్ల చిన్న సినిమాలు నష్టపోతున్నాయని బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ విమర్శించారు. పాన్ ఇండియా సినిమా కాన్సెప్ట్ ఒక పెద్ద స్కామ్ అని వ్యాఖ్యానించారు. నిర్మాతలు, వ్యాపారవేత్తలు లాభాల కోసం ఈ ట్రెండ్‌ను సృష్టించారని ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో జరిగిన ఛాయా సాహిత్యోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సినిమా కళారూపం నుంచి వ్యాపారంగా మారిపోయిందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మెక్‌డొనాల్డ్స్‌లో ఒకే రుచి ఉన్నట్లుగా, బాలీవుడ్ సినిమాలు కూడా ఒకే మూసలో తయారవుతున్నాయని విమర్శించారు. భారీ బడ్జెట్ చిత్రాల ప్రభావంతో సృజనాత్మకత తగ్గిపోతోందని అభిప్రాయపడ్డారు. పాన్ ఇండియా సినిమాల హవా కారణంగా కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలకు థియేటర్లు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మలయాళ చిత్ర పరిశ్రమను ఆయన ప్రశంసించారు. అక్కడ నటులు, దర్శకులు, నిర్మాతల మధ్య మంచి సహకారం ఉంటుందని, ఎవరూ తమను తాము పెద్ద హీరోలుగా భావించరని అన్నారు. వందల కోట్ల పారితోషికాలు డిమాండ్ చేసే ధోరణి కూడా అక్కడ తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సంస్కృతి ఇతర చిత్ర పరిశ్రమల్లోనూ రావాలని ఆకాంక్షించారు. సినిమాల్లో ఏది చూపిస్తే ఎవరి మనోభావాలు దెబ్బతింటాయోననే భయం ఫిల్మ్‌మేకర్స్‌లో పెరిగిందని, దీంతో స్వేచ్ఛగా, నిజాయతీగా కథలు చెప్పలేకపోతున్నారని అనురాగ్ కశ్యప్ అన్నారు.

రామాయణ'కు 1,228 కోట్ల వసూళ్లు



ఈవార్తలు, వినోదవాణి: రణ్‌బీర్ కపూర్, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన పౌరాణిక చిత్రం 'రామాయణ: రైజ్ ఆఫ్ ఎ లెజెండ్' బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోంది. విడుదలైన పది రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.1,228 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. రెండో వారంలోనూ సినిమా మంచి వసూళ్లతో దూసుకెళ్తోంది. ట్రేడ్ ట్రాకర్ సాక్‌నిల్క్ వివరాల ప్రకారం.. పదో రోజు శనివారం భారత్‌లో రూ.72.90 కోట్ల నెట్ వసూళ్లు వచ్చాయి. దీంతో దేశీయంగా మొత్తం నెట్ కలెక్షన్లు రూ.685.60 కోట్లకు చేరాయి. ఇండియా గ్రాస్ రూ.819.50 కోట్లుగా నమోదైంది. ఓవర్సీస్‌లో పదో రోజు సుమారు రూ.30 కోట్ల వసూలు కాగా, మొత్తం విదేశీ వసూళ్లు రూ.408.50 కోట్లకు చేరినట్లు పేర్కొంది. భాషల వారీగా చూస్తే హిందీ వెర్షన్ అత్యధిక వసూళ్లు సాధించింది. శనివారం ఒక్కరోజే హిందీలో రూ.53.75 కోట్లు, కన్నడలో రూ.5.40 కోట్లు, తమిళం, మలయాళంలో చెరో రూ.4.75 కోట్లు, తెలుగులో రూ.4.25 కోట్లు వసూలైనట్లు ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా సగటు ఆక్యుపెన్సీ 45.5 శాతంగా ఉండగా, మలయాళంలో అత్యధికంగా 83 శాతం నమోదైంది. రణ్‌బీర్ గత చిత్రం 'యానిమల్' పదో రోజు వసూళ్లతో పోలిస్తే 'రామాయణ' కలెక్షన్లు గణనీయంగా ఎక్కువగా ఉన్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. నితేశ్ తివారీ దర్శకత్వంలో నవంబర్ 5న విడుదలైన ఈ చిత్రం రెండో వారంలోనూ అదే జోరు కొనసాగిస్తోంది.



బన్నీతో సినిమా చేయాలని ఉంది

ఈవార్తలు, వినోదవాణి: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో కలిసి సినిమాలో నటించాలనే కోరికను నటి ఆషికా రంగనాథ్ వ్యక్తం చేశారు. ఇటీవల వీరిద్దరూ ఓ వాణిజ్య ప్రకటనలో కలిసి నటించారు. ఆ షూటింగ్ పూర్తయ్యాక బన్నీతో దిగిన ఫొటోలను ఆషికా ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. ఒక ఫొటోలో ఇద్దరూ కలిసి సెల్ఫీ దిగగా, మరో ఫొటోలో కెమెరాకు పోజులిచ్చారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉందని పేర్కొన్న ఆషికా.. మళ్లీ కలిసే సమయానికి అది సినిమా సెట్‌లో కావాలని ఆశిస్తున్నట్లు రాసుకొచ్చారు. ఆషికా పోస్ట్‌తో అల్లు అర్జున్‌తో కలిసి పూర్తి స్థాయి సినిమాలో నటించాలనే ఆమె కోరిక స్పష్టమైంది. కన్నడ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆమె తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు. నాగార్జున సరసన 'నా సామిరంగ', రవితేజతో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రాల్లో నటించారు. చిరంజీవి 'విశ్వంభర'లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఆమే నా ధైర్యం



ఈవార్తలు, వినోదవాణి: తల్లి శ్రీదేవి మరణవార్త తెలిసిన సమయంలో తన చెల్లెలు ఖుషీ కపూర్ తనకు అండగా నిలిచిన తీరును నటి జాన్వీ కపూర్ గుర్తుచేసుకున్నారు. కరణ్ జోహర్ నిర్వహించే 'కాఫీ విత్ కరణ్' షోలో పాల్గొన్న జాన్వీ, ఖుషీ తమ తల్లి మరణించిన రోజు జరిగిన సంఘటనలను పంచుకున్నారు. ఆ రోజు ఫోన్‌లో దుర్వార్త తెలియగానే తాను గదిలోనే ఏడుస్తూ ఉండిపోయానని జాన్వీ చెప్పారు. పక్క గదిలో ఖుషీ కూడా గట్టిగా ఏడుస్తున్న శబ్దం వినిపించడంతో ఆమె దగ్గరకు వెళ్లానని తెలిపారు. అయితే తనను చూడగానే ఖుషీ ఏడుపు ఆపేసి, తన పక్కన కూర్చుని ఓదార్చిందని గుర్తుచేసుకున్నారు. ఆ తర్వాత ఖుషీ ఆ విషయంపై మళ్లీ ఏడవడం తాను చూడలేదని చెప్పారు. ఆ సమయంలో కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతోనే కన్నీళ్లు ఆపుకున్నానని ఖుషీ తెలిపారు. తాను ఎప్పుడూ మానసికంగా ధైర్యంగా ఉండేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఖుషీలో తల్లి శ్రీదేవి లక్షణాలు కనిపిస్తాయని జాన్వీ అన్నారు. ముఖ్యంగా పని విషయంలో ఖుషీ అచ్చం తల్లిలాగే ఉంటుందని, ప్రశాంతంగా తన పని తాను చేసుకుపోతుందని చెప్పారు. అయితే కెమెరా ముందుకు రాగానే ఆమె పూర్తిగా మారిపోయి అద్భుతంగా నటిస్తుందని ప్రశంసించారు.



విడాకుల ప్రచారంలో నిజం లేదు

ఈవార్తలు, వినోదవాణి: దర్శకుడు కృష్ణవంశీతో తనకు విడాకులయ్యాయంటూ వస్తున్న ప్రచారాన్ని సీనియర్ నటి రమ్యకృష్ణ ఖండించారు. తామిద్దరం ఇప్పటికీ భార్యాభర్తలమేనని స్పష్టం చేశారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. తాను సోషల్ మీడియాలో పెద్దగా యాక్టివ్‌గా ఉండనని, వ్యక్తిగత విషయాలను బయటపెట్టడం ఇష్టం ఉండదని రమ్యకృష్ణ తెలిపారు. కృష్ణవంశీతో బంధం గురించి మాట్లాడుతూ.. కెరీర్, కుటుంబ బాధ్యతల కారణంగా తామిద్దరం వేర్వేరు నగరాల్లో ఉంటున్నామని చెప్పారు. తన కుమారుడు పుట్టిన సమయంలో తాను సీరియల్స్‌తో బిజీగా ఉండేదాన్నని, 15 రోజులకు ఒకసారి చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చి వెళ్లేదాన్నని గుర్తుచేసుకున్నారు. అలా ప్రయాణించిన ప్రతిసారీ కుమారుడు అనారోగ్యానికి గురయ్యేవాడని, దీంతో అతడిని చెన్నైలోనే చదివించాలని కృష్ణవంశీతో చెప్పినట్లు వివరించారు. రమ్యకృష్ణ, కృష్ణవంశీ 2003లో వివాహం చేసుకున్నారు.

పిల్లల్ని చూసుకోవడం తండ్రి బాధ్యతే: ఉపాసన

ఈవార్తలు, వినోదవాణి: పిల్లల పెంపకంలో తండ్రి బాధ్యతను సమాజం ప్రత్యేకంగా ప్రశంసించడం సరికాదని వ్యాపారవేత్త, రామ్ చరణ్ భార్య ఉపాసన కొణిదెల అన్నారు. పిల్లలకు అన్నం తినిపించడం, డైపర్ మార్చడం వంటి పనులు తండ్రి చేస్తే గొప్పగా చూస్తారని, అదే పనిని తల్లి రోజూ చేసినప్పుడు ఎవరూ ప్రశంసించరని ప్రశ్నించారు. ఒక తండ్రి పిల్లలను చూసుకోవడం ఎవరికీ చేసే ఉపకారం కాదని, అది తల్లిదండ్రిగా ఆయన ప్రాథమిక బాధ్యత మాత్రమేనని ఉపాసన పేర్కొన్నారు. ఇంట్లోనే మహిళలకు సమానత్వం లభించకపోతే, బయట కార్పొరేట్ బోర్డు రూముల్లోనూ సమానత్వం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఈ ఆలోచనా విధానం విద్యా వ్యవస్థలోనూ, ప్రజల ఆలోచనల్లోనూ భాగం కావాలని అన్నారు.





పటీదార్ విధ్వంసం..
48 బంతుల్లో 135 రన్స్

ఈవార్తలు, క్రీడావాణి: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మధ్యప్రదేశ్ కెప్టెన్ రజత్ పటీదార్ తన బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. న్యూ చండీగఢ్‌లో అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 48 బంతుల్లోనే అజేయంగా 135 పరుగులు చేశాడు. అతడి మెరుపు ఇన్నింగ్స్‌తో మధ్యప్రదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోరు సాధించింది. పటీదార్ తన ఇన్నింగ్స్‌లో 13 సిక్సర్లు, 8 ఫోర్లు బాదాడు. కేవలం 41 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దీంతో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో మధ్యప్రదేశ్ తరఫున సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. ఈ టోర్నీలో మధ్యప్రదేశ్ ఆటగాడిగా ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధికంగా 13 సిక్సర్లు బాదిన ఘనతనూ అందుకున్నాడు. మధ్యప్రదేశ్ 8 ఓవర్లలో 57 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న సమయంలో పటీదార్ క్రీజులోకి వచ్చాడు. వచ్చిన వెంటనే అస్సాం బౌలర్లపై ఎదురుదాడి ప్రారంభించాడు. మూడో నంబర్‌లో వచ్చిన శివాంగ్ కుమార్‌తో కలిసి కేవలం 62 బంతుల్లోనే 153 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ టోర్నీలో మధ్యప్రదేశ్‌కు ఇది రెండో అత్యధిక భాగస్వామ్యం. తన ఇన్నింగ్స్‌లో పటీదార్ కేవలం ఐదు డాట్ బాల్స్ మాత్రమే ఆడటం విశేషం. ఇటీవల గాయాల కారణంగా 50 ఓవర్ల ఫార్మాట్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న పటీదార్.. ఈ ఇన్నింగ్స్‌తో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాడు. నవంబర్ 19 నుంచి 29 వరకు దోహాలో జరగనున్న రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ కోసం ప్రకటించిన ఇండియా 'ఏ' జట్టుకు తొలుత వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అయితే ఆ జట్టు నుంచి తప్పుకుంటున్నట్లు బీసీసీఐకి తెలియజేశాడు.



సూర్య బాదుడు.. 29 బంతుల్లో 82 పరుగులు

ఈవార్తలు, క్రీడావాణి: టీమిండియా స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ సూపర్ ఫామ్ కొనసాగిస్తున్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ-2026లో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. హైదరాబాద్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 21 బంతుల్లో 60 పరుగులు చేసిన సూర్య.. సోమవారం గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో 29 బంతుల్లో 82 పరుగులతో చెలరేగాడు. తొమ్మిది ఫోర్లు, ఏడు సిక్సర్లతో గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ 19.2 ఓవర్లలో 197 పరుగులకు ఆలౌటైంది. అశుతోష్ శర్మ 22 బంతుల్లో ఒక ఫోర్, ఐదు సిక్సర్లతో 42 పరుగులు చేయగా, విశాల్ జైస్వాల్ 21 బంతుల్లో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 38 పరుగులు సాధించాడు. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ (3/30), అథర్వ అంకోలేకర్ (3/28) మూడేసి వికెట్లు తీశారు. 198 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై 26 బంతులు మిగిలి ఉండగానే ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. సూర్యకుమార్‌తోపాటు సర్ఫరాజ్ ఖాన్ 17 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 40 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. గుజరాత్ బౌలర్లలో రవి బిష్ణోయ్ రెండు వికెట్లు తీయగా, విశాల్ జైస్వాల్, హర్షల్ పటేల్, అర్జున్ తలో వికెట్ పడగొట్టారు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో సూర్య హాఫ్ సెంచరీలు సాధించడంతో టీమిండియాలోకి తిరిగి వస్తాడా? అనే చర్చ మొదలైంది. అయితే ప్రస్తుత భారత టీ20 జట్టులో అతడికి చోటు లేదు. జట్టులో ఉన్న ఆటగాళ్లంతా నిలకడగా రాణిస్తున్నారని, ముఖ్యంగా మిడిలార్డర్‌లో ప్రతి ఒక్కరూ సత్తా చాటుతున్నారని కథనం పేర్కొంది.



ఐసీసీ చైర్మన్‌గా జై షా రెండోసారి

ఈవార్తలు, క్రీడావాణి: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా జై షా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాలి వేదికగా జరిగిన ఐసీసీ బోర్డు సమావేశాల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మరోసారి ఆయనకు అంతర్జాతీయ క్రికెట్ మండలి నాయకత్వ బాధ్యతలు దక్కాయి. 2024 ఆగస్టులో తొలిసారి ఐసీసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జై షా.. అదే ఏడాది డిసెంబర్ 1న బాధ్యతలు చేపట్టారు. అప్పటికి ఆయన వయసు 35 ఏళ్లు. ఐసీసీ చరిత్రలో ఈ పదవి చేపట్టిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించారు.

ఐసీసీ చైర్మన్‌గా జై షా ఏకగ్రీవం

అప్పటి చైర్మన్ గ్రెగ్ బార్క్‌లే మూడోసారి పోటీకి ఆసక్తి చూపకపోవడంతో జై షా ఒక్కరే బరిలో నిలిచారు. ఐసీసీకి నాయకత్వం వహించిన ఐదో భారతీయుడిగా గుర్తింపు పొందారు. గతంలో జగ్మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్.శ్రీనివాసన్, శశాంక్ మనోహర్ ఈ బాధ్యతలు నిర్వహించారు. 2028లో లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్ తిరిగి చోటు దక్కించుకోవడం ఐసీసీ ముందున్న ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. క్రికెట్‌ను మరిన్ని దేశాలకు విస్తరించడం, మహిళల క్రికెట్‌ను బలోపేతం చేయడం, అసోసియేట్ సభ్య దేశాలకు అవకాశాలు పెంచడం, ఆటకు దీర్ఘకాలిక ఆదాయ వనరులు కల్పించడం వంటి అంశాలపై జై షా దృష్టి పెట్టనున్నారు. తనపై మరోసారి విశ్వాసం ఉంచిన ఐసీసీ బోర్డు సభ్యులకు జై షా కృతజ్ఞతలు తెలిపారు. సభ్య దేశాలతో కలిసి ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఒలింపిక్స్‌లో క్రికెట్ పునరాగమనం కొత్త ప్రేక్షకులను ఆకర్షించడంతోపాటు యువతలో ఆటపై ఆసక్తిని పెంచేందుకు మంచి అవకాశమని అభిప్రాయపడ్డారు. అభిమానులు, ఆటగాళ్లు, వాణిజ్య భాగస్వాముల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని క్రికెట్‌కు స్థిరమైన భవిష్యత్తును నిర్మించాల్సిన బాధ్యత ఉందన్నారు. జై షా కొనసాగింపును ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు చైర్మన్ రిచర్డ్ థాంప్సన్ స్వాగతించారు. ద్వైపాక్షిక సిరీస్‌ల ప్రాధాన్యాన్ని కాపాడుతూ అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్‌ను బలోపేతం చేయాలని సూచించారు. ఐసీసీ స్వతంత్ర డైరెక్టర్ రోస్ రివాజ్ మహిళల క్రికెట్ అభివృద్ధికి మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరారు. 2027 పురుషుల వన్డే ప్రపంచకప్ ద్వారా ఆఫ్రికాలో క్రికెట్‌కు కొత్త అవకాశాలు వస్తాయని ఐసీసీ డిప్యూటీ చైర్మన్, జింబాబ్వే క్రికెట్ ఛైర్మన్ తవెంగ్వా ముకుహ్లానీ ఆశాభావం వ్యక్తం చేశారు. క్రికెట్ సమగ్రతను కాపాడటం, వివిధ ఫార్మాట్లకు ఆదరణ నిలబెట్టడం, అసోసియేట్ దేశాలకు ఉన్నతస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాలు పెంచడం కూడా ఐసీసీ ముందున్న ప్రాధాన్యాలుగా ఉన్నాయి.

ఓజాకు రోహిత్ పరీక్ష!

ఈవార్తలు, క్రీడావాణి: టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తుపై చర్చ మొదలైంది. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో అతడికి చోటు దక్కుతుందా? అన్న ప్రశ్నకు కొత్త చీఫ్ సెలక్టర్ ప్రజ్ఞాన్ ఓజా సమాధానం చెప్పాల్సి ఉంది. న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగు వన్డే ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ కేవలం 30 పరుగులే చేయడం ఈ చర్చకు కారణమైంది.

ఫామ్ కోల్పోయినా కెరీర్ కొనసాగించాలన్న అతడి పట్టుదల సెలక్టర్లకు సవాలుగా మారింది. జూనియర్ క్రికెట్ రోజుల నుంచే రోహిత్, ఓజా మధ్య స్నేహం ఉంది. గతంలో నేషనల్ క్రికెట్ అకాడమీలో జరిగిన శిక్షణ శిబిరాల సమయంలోనూ వారి అనుబంధం మరింత బలపడింది.



ఇప్పుడు ఓజా సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో రోహిత్ విషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యక్తిగత అనుబంధాన్ని పక్కనపెట్టి ఆటగాడి ప్రస్తుత సామర్థ్యం, ప్రపంచకప్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు అప్పటి చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ సూచనతో ఓజా.. రోహిత్‌తో సమావేశమయ్యాడు. లార్డ్స్‌లో జరిగే మ్యాచ్ సందర్భంగా వన్డేలకు వీడ్కోలు పలికేందుకు సిద్ధంగా ఉన్నాడా? అన్నది తెలుసుకోవడమే ఆ భేటీ ఉద్దేశం. అయితే ఆ ప్రతిపాదనపై రోహిత్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. భారత క్రికెట్ వ్యవహారాలను నడిపిస్తున్న వారిపై తన అసహనాన్ని కూడా వెల్లడించినట్లు సమాచారం. ఈ పరిణామాల తర్వాత అగార్కర్, రోహిత్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని వార్తలు వచ్చాయి. ఇప్పుడు అగార్కర్ స్థానంలో వచ్చిన ఓజాకు ఆ బాధ్యత బదిలీ అయింది. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో భారత టాప్ ఆర్డర్ పదేపదే విఫలమవడంపై కోచ్ గౌతమ్ గంభీర్ ఆందోళన వ్యక్తం చేశాడు. అయితే బౌలర్లు రాణించడంతో భారత్ సిరీస్‌ను 3-1తో గెలుచుకుంది. సీమింగ్, బౌన్స్ ఉన్న పిచ్‌లపై రోహిత్ ఇబ్బంది పడ్డాడు. వెస్టిండీస్‌తో స్వదేశంలో రాణించినప్పటికీ, న్యూజిలాండ్ పరిస్థితుల్లో అతడి వైఫల్యాలు స్పష్టంగా కనిపించాయి. బౌన్స్‌ను ఎదుర్కోవడం, పవర్‌ప్లేలో నిలదొక్కుకోవడం అతడికి సవాలుగా మారాయి. ప్రపంచకప్‌కు ముందు భారత్ స్వదేశంలో మరో ఆరు వన్డేలు ఆడనుంది. ఆ తర్వాత ఆరు నెలల విరామం ఉంటుంది. శ్రీలంక, జింబాబ్వేలతో స్వదేశంలో జరిగే మ్యాచ్‌ల్లో రోహిత్ భారీ స్కోర్లు సాధించే అవకాశం ఉందని అంచనా. అయితే స్వదేశంలో పరుగులు చేసినంత మాత్రాన విదేశీ పరిస్థితుల్లోనూ రాణిస్తాడని సెలక్టర్లు భావించకపోవచ్చు. ఐపీఎల్‌కు ముందు దాదాపు మూడు నెలల విరామం ఉండటం కూడా అతడి ఫామ్‌పై ప్రభావం చూపుతుందా అన్న సందేహాలున్నాయి. రోహిత్ విజయ్ హజారే ట్రోఫీలో ఆడే అవకాశమూ ఉంది. అయితే దేశవాళీ వన్డే టోర్నీలో పాల్గొనడంతోపాటు అక్కడి ప్రదర్శనలో స్థిరత్వం చూపించడం ముఖ్యం. ముఖ్యంగా కఠిన పరిస్థితుల్లో అతడి ఆటతీరును సెలక్టర్లు అంచనా వేయాల్సి ఉంటుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా భారత క్రికెట్‌కు సేవలందించిన రోహిత్‌కు గౌరవప్రదమైన వీడ్కోలు దక్కాలన్నది అభిమానుల ఆకాంక్ష. అయితే ప్రపంచకప్ ప్రణాళికల్లో తన స్థానం ఏంటో రోహిత్‌కు స్పష్టత రావాల్సి ఉంది. అతడి ప్రస్తుత సామర్థ్యం, భవిష్యత్తు ప్రణాళికలపై సెలక్షన్ కమిటీ కూడా స్పష్టమైన నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉంది. వచ్చే ఏడాది జింబాబ్వేతో వాంఖడే స్టేడియంలో జరగనున్న వన్డే మ్యాచ్ రోహిత్ కెరీర్‌లో కీలక మలుపుగా మారుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

సౌతాఫ్రికా గడ్డపై బంగ్లాదేశ్ రికార్డు



ఈవార్తలు, క్రీడావాణి: తాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది. సఫారీ గడ్డపై టెస్టుల్లో తొలిసారి 400 పరుగుల మార్కును అందుకుంది. ఇప్పటివరకు సౌతాఫ్రికాపై బంగ్లాదేశ్‌కు 326 పరుగులే అత్యధిక స్కోరుగా ఉండేవి. తాజాగా జోహన్నెస్‌బర్గ్ వేదికగా జరుగుతున్న టెస్టులో ఆ జట్టు 400 పరుగులకు ఆలౌటైంది. హిద్ హృదోయ్ (137), లిటన్ దాస్ (120) సెంచరీలతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన సౌతాఫ్రికా రెండో రోజు ఆట ముగిసే సమయానికి 62 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. మార్కూస్ అకెర్‌మన్ (157) సెంచరీ సాధించగా, జుబైర్ హంజా (83) అర్ధసెంచరీతో రాణించాడు. ప్రస్తుతం సౌతాఫ్రికా మరో 113 పరుగులు వెనుకబడి ఉంది. తాఫ్రికాపై బంగ్లాదేశ్ చేసిన అత్యధిక టెస్టు స్కోర్లలో తాజా 400 పరుగులే అగ్రస్థానంలో నిలిచాయి. అంతకుముందు 2015లో చట్టోగ్రామ్‌లో జరిగిన టెస్టులో బంగ్లాదేశ్ 326 పరుగులు చేసింది. ఆ మ్యాచ్ డ్రాగా ముగిసింది. 2017లో పోర్ట్ ఎలిజబెత్‌లో జరిగిన టెస్టులో 320 పరుగులకు ఆలౌటైంది.

కోహ్లీ బాధపడతాడు: కపిల్ దేవ్



ఈవార్తలు, క్రీడావాణి: టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికి విరాట్ కోహ్లీ పెద్ద తప్పు చేశాడని భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ అభిప్రాయపడ్డాడు. మరో పదేళ్ల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నందుకు కోహ్లీ పశ్చాత్తాపపడతాడని వ్యాఖ్యానించాడు. ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో విఫలమైన కోహ్లీ.. గతేడాది అనూహ్యంగా టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ ఆడేందుకు ఆసక్తి చూపిన కోహ్లీ.. ఆ తర్వాత సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. మానసిక ఒత్తిడి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న కోహ్లీ.. మళ్లీ నిలకడగా పరుగులు చేస్తున్నాడు. 16 మ్యాచ్‌ల్లో నాలుగు సెంచరీలు, ఆరు హాఫ్ సెంచరీలు సాధించాడు. కోహ్లీ ఫిట్‌నెస్ అద్భుతంగా ఉన్నప్పుడు టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడం తనను ఆశ్చర్యపరిచిందని కపిల్ దేవ్ అన్నాడు. 'టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించి విరాట్ కోహ్లీ ఘోర తప్పిదం చేశాడని నేను భావిస్తున్నా. పదేళ్ల తర్వాత అతను కచ్చితంగా పశ్చాత్తాపపడతాడు. రిటైర్మెంట్ ప్రకటించాల్సింది కాదు. విరాట్ సూపర్ ఫిట్‌గా ఉన్నాడు. ఇతర ఆటగాళ్లందరి కంటే అతడి ఫిట్‌నెస్ మెరుగ్గా ఉంది. 25 ఏళ్ల కుర్రాడితో కూడా ఫిట్‌నెస్ విషయంలో పోటీపడగలడు. కోపంలో రిటైర్మెంట్ ప్రకటించడం సరికాదు. మోహిందర్ అమర్‌నాథ్‌లా ఓపికగా ఉండాలి. ఆయన ఎన్నోసార్లు జట్టులో చోటు కోల్పోయినా, తిరిగి వచ్చి తన సత్తా నిరూపించుకున్నారు' అని మిడ్ డేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కపిల్ దేవ్ పేర్కొన్నాడు. టెస్టుల్లో తనకు ఎంతో ఇష్టమైన సుదీర్ఘ ఫార్మాట్‌లో కోహ్లీ 123 మ్యాచ్‌లు ఆడి 9,230 పరుగులు చేశాడు. ఇందులో 30 సెంచరీలు ఉన్నాయి. రోహిత్ శర్మ భవిష్యత్తుపై కూడా కపిల్ దేవ్ స్పందించాడు.

ఈవార్తలు
ప్రజావాణి
మంగళవారం 17-11-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

వాతావరణ హామీలకు గడువు పెట్టాలి!

వాతావరణ మార్పుల ప్రభావం భవిష్యత్తులో వస్తుందన్న హెచ్చరికల దశ దాటిపోయింది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో తీవ్రమైన వేడి, కరువు, వరదలు, తుపాన్లు, సముద్ర మట్టం పెరుగుదల వంటి పరిణామాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. పంటలు దెబ్బతింటున్నాయి. నీటి వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఇళ్లు, రహదారులు, విద్యుత్ వ్యవస్థలు, జీవనోపాధి దెబ్బతింటున్నాయి. ఈ సమస్యను ఎదుర్కోవడానికి ప్రపంచ దేశాలు ఏళ్లుగా సమావేశాలు నిర్వహిస్తున్నా, ఉద్గారాల తగ్గింపు, వాతావరణ అనుకూల చర్యలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక సాయం వంటి అంశాల్లో ఆశించిన వేగం కనిపించడం లేదు. టర్కీలోని అంతల్యాలో జరుగుతున్న కాప్-31 వాతావరణ సదస్సులో నవంబర్ 16న విడుదలైన ముసాయిదా నిర్ణయ పత్రం ఈ చర్చను మరోసారి ముందుకు తెచ్చింది. అయితే ముసాయిదాలోని ప్రతిపాదనలు తుది నిర్ణయాలు కావు. దేశాల మధ్య ఏకాభిప్రాయం వచ్చిన అంశాలకే తుది రూపం లభిస్తుంది. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రధాన డిమాండ్ ఆర్థిక సాయం. ఉద్గారాలను తగ్గించడానికి కొత్త సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, విద్యుత్ నిల్వ, ఆధునిక గ్రిడ్‌లు అవసరం. అదే సమయంలో ఇప్పటికే వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొంటున్న గ్రామాలు, పట్టణాలకు వరద నియంత్రణ, తాగునీటి భద్రత, వ్యవసాయ అనుకూల పద్ధతులు, ఆరోగ్య సేవలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు అవసరం. కానీ వీటికి కావాల్సిన నిధులు అభివృద్ధి చెందుతున్న దేశాల వద్ద పరిమితంగా ఉన్నాయి. కాప్-31 ముసాయిదా ప్రకారం, అభివృద్ధి చెందుతున్న దేశాలకు 2035 నాటికి ఏటా సుమారు 305 బిలియన్ డాలర్ల వాతావరణ అనుకూలత నిధులు అవసరమవుతాయని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం అంచనా వేసింది. కానీ 2024లో అంతర్జాతీయంగా అందిన ప్రభుత్వ అనుకూలత నిధులు 28 నుంచి 32 బిలియన్ డాలర్ల మధ్యే ఉన్నట్లు పత్రం పేర్కొంది. అవసరానికి, అందుతున్న సాయానికి మధ్య ఉన్న అంతరం ఎంత పెద్దదో ఈ సంఖ్యలు తెలియజేస్తున్నాయి. అందుకే అభివృద్ధి చెందిన దేశాలు రుణాల రూపంలో కాకుండా సాధ్యమైనంతవరకు గ్రాంట్లు, తక్కువ వడ్డీ సాయం, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ ద్వారా మద్దతు ఇవ్వాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు కోరుతున్నాయి. వాతావరణ మార్పులకు చారిత్రకంగా ఎక్కువగా కారణమైన దేశాలు తమ బాధ్యతను గుర్తించాలని వాటి వాదన. పేద దేశాలు ఇప్పటికే అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్నాయి. వరదలు, తుపాన్లు, కరువుల వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను పునర్నిర్మించడానికి మళ్లీ అప్పులు తీసుకోవాల్సి వస్తే అభివృద్ధి మరింత కష్టమవుతుంది. వాతావరణ సాయం పేరుతో కొత్త అప్పుల బంధం ఏర్పడకూడదు. నిధులు నిజంగా అవసరమైన ప్రాంతాలకు చేరేలా సరళమైన దరఖాస్తు, ఆమోద విధానాలు ఉండాలి. స్థానిక సంస్థలు, రైతు సంఘాలు, మహిళా సంఘాలు, ప్రభావిత సముదాయాలు కూడా నిధుల వినియోగంలో భాగస్వాములు కావాలి.

పట్టా కన్నా కాలమే కొలమానం



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
పౌర సంబంధాల అధికారి,
కాకతీయ విశ్వవిద్యాలయం,
ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, కేయూ

మనిషి జీవితాన్ని అంచనా వేయడానికి నేడు సమాజం అనుసరిస్తున్న ప్రధానమైన కొలమానం విద్యార్హతలు, సర్టిఫికెట్లు, హోదాలు, ఉద్యోగ స్థాయిలు. ఒక వ్యక్తి ఎన్ని డిగ్రీలు సంపాదించాడు? ఏ విశ్వవిద్యాలయంలో చదివాడు? ఎంత పెద్ద పదవిలో ఉన్నాడు? ఎంత సంపాదిస్తున్నాడు? అనే ప్రశ్నల ఆధారంగా అతడి సామర్థ్యాన్ని నిర్ణయించే ధోరణి పెరిగింది. అయితే ఒక మనిషి నిజమైన విజ్ఞానం, పరిణతి, సామాజిక అవగాహన, మానవత్వం, నాయకత్వ లక్షణాలను కేవలం తరగతి గదిలో పొందిన సర్టిఫికెట్లతో కొలవడం సాధ్యమా? జీవితమనే విశాలమైన విశ్వవిద్యాలయంలో కాలం నేర్పే పాఠాలకు ఏ విద్యాసంస్థ అయినా ప్రత్యామ్నాయం కాగలదా? అన్నది సమాజం ఆలోచించాల్సిన ముఖ్యమైన ప్రశ్న. తరగతి గది మనిషికి జ్ఞానానికి సంబంధించిన పునాదులు వేస్తే, కాలం ఆ జ్ఞానాన్ని జీవిత వాస్తవాల మధ్య పరీక్షిస్తుంది. విద్యాసంస్థలు పాఠ్యాంశాలను బోధిస్తే, జీవితం అనుభవాల ద్వారా మనిషికి సమాజ స్వరూపాన్ని పరిచయం చేస్తుంది. మానవ నాగరికత చరిత్రను పరిశీలిస్తే విద్య అనేది కేవలం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకే పరిమితమైన ప్రక్రియ కాదని స్పష్టమవుతుంది. ప్రాచీన సమాజాల్లో మనిషి ప్రకృతిని పరిశీలించడం ద్వారా, వృత్తులను అభ్యసించడం ద్వారా, పెద్దల అనుభవాలను వినడం ద్వారా, సామూహిక జీవన విధానంలో భాగస్వామి కావడం ద్వారా విజ్ఞానాన్ని సంపాదించేవాడు. వ్యవసాయం, వైద్యం, నిర్మాణ రంగం, లోహ పరిశ్రమ, నీటి నిర్వహణ, నక్షత్ర పరిశీలన వంటి అనేక రంగాల్లో తరతరాల అనుభవం జ్ఞానంగా పరిణామం చెందింది. భారతదేశ చరిత్రలో గురుకుల వ్యవస్థ, తక్షశిల, నలంద వంటి విద్యాకేంద్రాలు విజ్ఞాన వికాసానికి దోహదపడ్డాయి. అదే సమయంలో వ్యవసాయదారులు, చేతివృత్తులవారు, శిల్పులు, వైద్యులు తమ అనుభవ సంపద ద్వారా సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. అంటే పుస్తక విజ్ఞానంతోపాటు ఆచరణాత్మక అనుభవం కూడా మానవ నాగరికత అభివృద్ధికి ప్రధాన ఆధారంగా నిలిచింది. చరిత్రలో గొప్ప వ్యక్తుల జీవితాలను పరిశీలించినప్పుడు కాలం, అనుభవం, నిరంతర పరిశీలన మనిషి ఆలోచనా విధానాన్ని ఎంతగా మార్చగలవో అర్థమవుతుంది. గౌతమ బుద్ధుడి జీవితం ఇందుకు ఒక చారిత్రక ఉదాహరణ. రాజభవనంలోని సౌకర్యవంతమైన జీవితం నుంచి బయటకు వచ్చి వృద్ధాప్యం, వ్యాధి, మరణం వంటి మానవ జీవిత వాస్తవాలను పరిశీలించిన తర్వాత ఆయనలో ఏర్పడిన ప్రశ్నలు ఒక కొత్త తాత్విక మార్గానికి దారితీశాయి. సమాజంలోని దుఃఖానికి కారణాలను అన్వేషించడం ద్వారా ఆయన మానవ జీవితానికి సంబంధించిన లోతైన ఆలోచనలను ప్రపంచానికి అందించారు. అలాగే అశోకుడి జీవితంలో కళింగ యుద్ధం ఒక కీలక మలుపుగా నిలిచింది. యుద్ధంలో జరిగిన ప్రాణనష్టం, మానవ విషాదం ఆయన పాలనా దృక్పథంలో మార్పుకు కారణమయ్యాయి. అధికారం, సైనిక విజయం కంటే మానవ సంక్షేమం గొప్పదనే ఆలోచనకు ఆయన ప్రాధాన్యమిచ్చారు. ఈ ఉదాహరణలు జీవితంలో ఎదురయ్యే సంఘటనలు మనిషి ఆలోచనలను, విలువలను, నిర్ణయాలను ఎలా ప్రభావితం చేస్తాయో తెలియజేస్తాయి.

భారతదేశ సామాజిక చరిత్రలో మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల జీవితాలు విద్యకు సామాజిక పరివర్తనతో ఉన్న సంబంధాన్ని స్పష్టం చేస్తాయి. అంబేద్కర్ ఉన్నత విద్యను అభ్యసించి అనేక విద్యార్హతలు సంపాదించినప్పటికీ, ఆయన ఆలోచనలకు మరింత లోతును అందించింది భారతీయ సమాజంలో ప్రత్యక్షంగా ఎదురైన కులవివక్ష, అసమానతలు, సామాజిక అవమానాలు. వ్యక్తిగత అనుభవాలను విస్తృతమైన సామాజిక విశ్లేషణతో అనుసంధానించి సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, రాజ్యాంగ హక్కుల కోసం ఆయన పోరాడారు. సావిత్రిబాయి ఫూలే విద్యను మహిళల విముక్తికి సాధనంగా మలిచారు. ఈ జీవితాలు విద్యార్హతలు ఎంత ముఖ్యమైనవో, వాటిని సామాజిక బాధ్యతతో అనుసంధానించినప్పుడే వాటి అసలైన విలువ ఎంత పెరుగుతుందో తెలియజేస్తాయి. ఆధునిక ప్రపంచ చరిత్రలో పారిశ్రామిక విప్లవం మరో ముఖ్యమైన పాఠాన్ని నేర్పింది. పద్దెనిమిదో శతాబ్దం చివరి నుంచి పంతొమ్మిదో శతాబ్దం వరకు యూరప్‌లో పారిశ్రామికీకరణ వేగం పుంజుకున్నప్పుడు సమాజంలోని వృత్తులు, ఉపాధి అవకాశాలు, కుటుంబ వ్యవస్థలు, ఆర్థిక సంబంధాలు సమూలంగా మారాయి. కేవలం సాంప్రదాయ విద్య ఉన్నవారే కాకుండా యంత్రాల పనితీరును అర్థం చేసుకున్నవారు, కొత్త సాంకేతికతలను నేర్చుకున్నవారు, సమస్యలను పరిష్కరించగలిగినవారు పారిశ్రామిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. అనుభవం, ప్రయోగం, పరిశీలన, సృజనాత్మకత సమాజ పురోగతికి అవసరమైన శక్తులుగా మారాయి. నేడు సమాచార సాంకేతిక రంగం, కృత్రిమ మేధ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థల విస్తరణ కూడా ఇదే విషయాన్ని మరోసారి నిరూపిస్తున్నాయి. నిన్నటి విద్యార్హత ఒక్కటే నేటి సామర్థ్యానికి హామీ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. నిరంతరం నేర్చుకునే వ్యక్తికే మారుతున్న ప్రపంచంలో నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది. ఇక్కడ ఒక ముఖ్యమైన సామాజిక సమస్యను కూడా గుర్తించాలి. సర్టిఫికెట్ల ఆధారంగా మనుషుల విలువను నిర్ణయించే వ్యవస్థలో అనుభవజ్ఞులైన రైతులు, కార్మికులు, కళాకారులు, చేతివృత్తులవారు, సామాజిక కార్యకర్తలు, సంప్రదాయ వైద్య పరిజ్ఞానం కలిగినవారు తగిన గుర్తింపును పొందలేకపోతున్నారు. ఒక రైతుకు వ్యవసాయంలో నలభై సంవత్సరాల అనుభవం ఉండవచ్చు. నేల స్వభావం, విత్తనాల ఎంపిక, వర్షపాతం మార్పులు, నీటి వినియోగం, పంటల వ్యాధుల గురించి అతడికి అపారమైన ఆచరణాత్మక పరిజ్ఞానం ఉండవచ్చు. అయితే అతడి వద్ద వ్యవసాయ డిగ్రీ లేదనే కారణంతో ఆ జ్ఞానాన్ని తక్కువగా చూడటం సమాజంలోని విద్యా దృక్పథంలోని లోపాన్ని సూచిస్తుంది. ఒక వడ్రంగి, కుమ్మరి, నేత కార్మికుడు, మత్స్యకారుడు తమ వృత్తిలో సంపాదించిన అనుభవం కూడా ఒక ప్రత్యేకమైన విజ్ఞాన సంపదే. ఈ అనుభవాలను ఆధునిక శాస్త్రీయ పరిశోధనతో అనుసంధానించగలిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలు ఏర్పడతాయి.

అయితే సర్టిఫికెట్లు అవసరం లేదని, అనుభవమే అన్నింటికంటే గొప్పదని ఏకపక్షంగా వాదించడం కూడా సరైనది కాదు. వైద్యం, ఇంజనీరింగ్, న్యాయశాస్త్రం, శాస్త్రీయ పరిశోధన వంటి రంగాల్లో క్రమబద్ధమైన విద్య, శిక్షణ, అర్హతలు, వృత్తిపరమైన ప్రమాణాలు తప్పనిసరి. అనుభవం పేరుతో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని నిర్లక్ష్యం చేయడం సమాజానికి ప్రమాదకరం. అదే విధంగా డిగ్రీలు ఉన్నాయనే కారణంతో ఒక వ్యక్తి సమాజంలోని ప్రతి సమస్యను అర్థం చేసుకోగలడని భావించడం కూడా పొరపాటే. విద్య, అనుభవం రెండూ పరస్పర విరుద్ధమైనవి కావు. అవి ఒకదానికొకటి బలాన్ని అందించాలి. పుస్తక జ్ఞానం జీవితాన్ని అర్థం చేసుకోవడానికి మార్గం చూపాలి. జీవితానుభవం పుస్తక జ్ఞానాన్ని మరింత పరిపక్వం చేయాలి. నేటి విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న మరో ప్రధానమైన సవాలు ఉద్యోగం కోసం మాత్రమే చదివే ధోరణి. విద్యార్థి చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం, జీతం, పదోన్నతి, హోదా వంటి అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నాడు. కానీ సమాజం పట్ల బాధ్యత, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ అవగాహన, మానవ హక్కులు, సామాజిక న్యాయం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు విద్యలో తగిన ప్రాధాన్యం లభించాలి. ఒక వ్యక్తి గొప్ప ఉద్యోగంలో ఉన్నప్పటికీ సమాజంలోని పేదరికం, నిరుద్యోగం, కులవివక్ష, లింగ అసమానతలు, రైతుల సమస్యలు, కార్మికుల కష్టాలను అర్థం చేసుకోలేకపోతే అతడి విద్య సామాజిక ప్రయోజనాన్ని పూర్తిస్థాయిలో నెరవేర్చినట్లు కాదు. సమాజాన్ని చదవగలిగిన వ్యక్తే విద్య యొక్క అసలైన లక్ష్యాన్ని గ్రహించగలడు. జీవితంలో కాలం మనిషికి నేర్పే గొప్ప పాఠం మార్పును అంగీకరించడం. బాల్యంలో కుటుంబం మనకు విలువలను నేర్పుతుంది. యవ్వనంలో విద్య, ఉద్యోగం, పోటీ ప్రపంచాన్ని పరిచయం చేస్తాయి. మధ్య వయస్సులో బాధ్యతలు, ఆర్థిక ఒత్తిళ్లు, కుటుంబ సమస్యలు, వృత్తిపరమైన సంఘర్షణలు ఎదురవుతాయి. వయస్సు పెరిగేకొద్దీ మనుషుల స్వభావాలు, సంబంధాల విలువ, సమాజంలోని అసమానతలు, అధికార స్వరూపం, కాలం మారుస్తున్న పరిస్థితులు మరింత స్పష్టంగా అర్థమవుతాయి. అయితే ఎక్కువ సంవత్సరాలు జీవించినంత మాత్రాన ప్రతి ఒక్కరూ జ్ఞానవంతులవుతారని చెప్పలేం. అనుభవాన్ని విశ్లేషించగలగడం, తప్పుల నుంచి నేర్చుకోవడం, ఇతరుల బాధలను అర్థం చేసుకోవడం, తన అభిప్రాయాలను అవసరమైనప్పుడు సవరించుకోవడం ద్వారానే కాలం నిజమైన గురువుగా మారుతుంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ ఈ ఆలోచనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. రాజకీయ నాయకులు, అధికారులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు తమ విద్యార్హతలతోపాటు ప్రజల జీవన వాస్తవాలను అర్థం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో రైతు ఎదుర్కొంటున్న సమస్యను కార్యాలయంలోని నివేదిక ద్వారా మాత్రమే పూర్తిగా తెలుసుకోలేరు. కార్మికుడి జీవన పరిస్థితిని గణాంకాలతో మాత్రమే అంచనా వేయలేరు. పేద కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను విధాన పత్రాల ద్వారా మాత్రమే అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. ప్రజల మధ్యకు వెళ్లడం, వారి అనుభవాలను వినడం, సమస్యల మూలాలను పరిశీలించడం ద్వారానే సమర్థవంతమైన పరిపాలన సాధ్యమవుతుంది. అధికారిక హోదా కంటే సామాజిక బాధ్యత గొప్పదనే అవగాహన పాలకుల్లో పెరగాలి. విద్యాసంస్థలు కూడా తమ బోధనా విధానాల్లో మార్పులు తీసుకురావాలి. తరగతి గది బోధనకు క్షేత్రస్థాయి అధ్యయనం, సామాజిక పరిశీలన, గ్రామీణ పర్యటనలు, వృత్తిపరమైన శిక్షణ, పరిశోధన, ప్రజలతో ప్రత్యక్ష సంభాషణలను జోడించాలి. విద్యార్థులు పరీక్షల్లో మార్కులు సాధించడమే కాకుండా జీవిత సమస్యలను విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాల్లోని విషయాలను వివరించడానికే పరిమితం కాకుండా విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, విమర్శనాత్మక ఆలోచన, మానవీయ దృక్పథం పెంపొందించాలి. అనుభవజ్ఞులైన వృత్తి నిపుణులు, రైతులు, కళాకారులు, సామాజిక కార్యకర్తల జ్ఞానాన్ని విద్యా ప్రక్రియలో భాగం చేయాలి. ఇదే సందర్భంలో భారతీయ సమాజంలో తరతరాలుగా కొనసాగుతున్న జ్ఞాన సంప్రదాయాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. గ్రామీణ సమాజంలో పెద్దలు అందించే జీవిత పాఠాలు, కుటుంబ వ్యవస్థలో తరతరాలుగా సంక్రమించే అనుభవాలు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానాలు ఒక ప్రత్యేకమైన సామాజిక విజ్ఞానాన్ని నిర్మించాయి. వర్షాకాలాన్ని అంచనా వేయడం, భూసారాన్ని గుర్తించడం, నీటి వనరులను సంరక్షించడం, పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, స్థానిక వాతావరణానికి అనుగుణంగా పంటలను ఎంచుకోవడం వంటి అనేక విషయాల్లో గ్రామీణ ప్రజలకు అనుభవపూర్వకమైన అవగాహన ఉంది. ఈ పరిజ్ఞానాన్ని ఆధునిక శాస్త్రీయ పరిశోధనతో అనుసంధానించడం ద్వారా సమాజానికి మరింత ప్రయోజనం చేకూర్చవచ్చు. సంప్రదాయ జ్ఞానాన్ని గౌరవించడం అంటే శాస్త్రీయ ప్రమాణాలను పక్కనపెట్టడం కాదు. దానిలోని ప్రయోజనకరమైన అంశాలను పరిశీలించి ఆధునిక విజ్ఞానంతో అభివృద్ధి చేయడం. ప్రస్తుతం కృత్రిమ మేధ, ఆటోమేషన్, డిజిటల్ సాంకేతికతలు మానవ జీవితాన్ని వేగంగా మారుస్తున్నాయి.

సమాచారాన్ని సేకరించడం, విశ్లేషించడం, సమాధానాలను రూపొందించడం వంటి పనులను యంత్రాలు వేగంగా చేయగలుగుతున్నాయి. అయితే మానవ బాధను అర్థం చేసుకోవడం, నైతిక నిర్ణయాలు తీసుకోవడం, సామాజిక పరిస్థితులను సమగ్రంగా పరిశీలించడం, మానవ సంబంధాలకు విలువనివ్వడం వంటి అంశాల్లో మనిషి వివేకం అత్యంత కీలకం. భవిష్యత్తులో సర్టిఫికెట్ల కంటే నిరంతర అభ్యాసం, అనుభవం, సృజనాత్మకత, మానవీయ విలువల సమన్వయమే వ్యక్తి సామర్థ్యాన్ని నిర్ణయించే ప్రధాన అంశాలుగా మారనున్నాయి. కాబట్టి విద్యా విధానం లక్ష్యం కేవలం పట్టభద్రులను తయారుచేయడం కాకుండా, జీవితాన్ని అర్థం చేసుకోగలిగిన పౌరులను నిర్మించడం కావాలి. విద్యార్థి సమాజాన్ని చదవాలి, చరిత్రను విశ్లేషించాలి, వర్తమానాన్ని అర్థం చేసుకోవాలి, భవిష్యత్తును నిర్మించగలగాలి. అటువంటి విద్య మాత్రమే వ్యక్తిగత విజయాన్ని సామాజిక ప్రయోజనంగా మార్చగలదు.

గిగ్ చట్టం.. అమలే అసలు పరీక్ష

ఉదయం నుంచి రాత్రి వరకు ఫోన్‌లో వచ్చే ఆర్డర్ల కోసం ఎదురుచూస్తూ, ఎండా వానా లెక్కచేయకుండా రోడ్లపై తిరిగే డెలివరీ సిబ్బంది, ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే క్యాబ్, బైక్ డ్రైవర్లు, ఇంటింటికీ సేవలందించే కార్మికులు ఇప్పుడు పట్టణ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగమయ్యారు. వినియోగదారులకు సౌకర్యం కల్పించే ఈ వ్యవస్థ వెనుక వేలాది మంది శ్రమ ఉంది. కానీ ఆ శ్రమకు తగిన భద్రత, ఆదాయ స్థిరత్వం, వైద్య సాయం, ఉద్యోగ భరోసా మాత్రం చాలాకాలంగా ప్రశ్నార్థకంగానే ఉన్నాయి. ఒక యాప్‌లో ఖాతా నిలిపివేస్తే మరుసటి రోజు నుంచి పని లేకుండా పోయే పరిస్థితి. రేటింగ్ తగ్గినా, ప్రోత్సాహకాలు మారినా ఆదాయంపై ప్రభావం. ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడే ప్రమాదం. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికుల కోసం ప్రత్యేక చట్టం, నిబంధనలను అమల్లోకి తీసుకురావడం ఆహ్వానించదగిన పరిణామం. నవంబర్ 14న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కలిసి తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ కార్మికుల సామాజిక భద్రత, సంక్షేమ విధానాన్ని ప్రారంభించారు.

ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కూడా ప్రారంభించారు. తెలంగాణ ప్లాట్‌ఫామ్ ఆధారిత గిగ్ కార్మికుల నమోదు, సామాజిక భద్రత, సంక్షేమ చట్టం అమల్లోకి వచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి గిగ్ కార్మికుడికి రూ. 5 లక్షల జీవిత బీమా, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 10 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని వెల్లడించింది. ప్రత్యేక సంక్షేమ బోర్డు, గుర్తింపు కార్డుల ఏర్పాటునూ ప్రకటించింది. ఈ చట్టం ప్రాధాన్యం కేవలం బీమా సౌకర్యానికే పరిమితం కాదు. గిగ్ కార్మికుల పని సంబంధాలను కూడా నియంత్రించే ప్రయత్నం ఇందులో ఉంది. కనీస పారితోషికం, చెల్లింపుల్లో పారదర్శకత, కాంట్రాక్టు నిబంధనల్లో మార్పులపై ముందస్తు సమాచారం, ఏకపక్షంగా ఖాతాలను నిలిపివేయకుండా రక్షణ, వివక్షకు తావులేని పని వాతావరణం, ఫిర్యాదుల పరిష్కారానికి నిర్దిష్ట వ్యవస్థ వంటి అంశాలకు నిబంధనల్లో చోటు కల్పించారు. ఒక కార్మికుడు పని చేయలేనని చెప్పినందుకు శిక్షించే పద్ధతులకు అడ్డుకట్ట వేయడం, సంపాదనలో కోతలు, రేటింగ్‌ల మార్పులపై వివరాలు అందించడం వంటి అంశాలు కూడా కీలకమైనవే. అయితే చట్టం ప్రకటించడమే కార్మికుల జీవితాల్లో మార్పు తెచ్చినట్లు కాదు. బీమా ఉందని చెప్పడం ఒకటైతే, ప్రమాదం జరిగినప్పుడు పరిహారం సకాలంలో అందించడం మరొకటి. ఆరోగ్య బీమా ప్రకటించడం ఒకటైతే, ఆసుపత్రిలో చికిత్సకు అనుమతి, ఖర్చుల చెల్లింపు, క్లెయిమ్ పరిష్కారం సులభంగా జరగడం మరొకటి. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం ఒకటైతే, అది కార్మికుల ఫిర్యాదులపై నిర్ణయాలు తీసుకుని, సంస్థల నుంచి నిధులు వసూలు చేయగలగడం మరొకటి. అందువల్ల ప్రభుత్వం ప్రతి ప్రయోజనానికి అర్హత, దరఖాస్తు విధానం, అమలు బాధ్యత, పరిష్కార గడువు వంటి వివరాలను స్పష్టంగా ప్రకటించాలి.

- ప్రదీప్ గౌడ్, గిగ్ వర్కర్, హైదరాబాద్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.